జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్తు, దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 15 సంచిక 31 విశాఖపట్నం శుక్రవారం 15 అక్టోబరు 2021 8 పేజీలు వెల : 5.00







## లక్ష్యంలోగా...

# సర్వేను పూర్తి చేయాలి

అమరావతి,అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. నిర్దేశించుకున్న లక్ష్యంలోగా సర్వేను పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. భూ క్రయ విక్రయాలు జరిగినప్పుడే రికార్డులు కూడా అప్‌డేట్ చేయాలన్నారు. గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు సంబంధించిన ప్రక్రియలు చేపట్టాలన్నారు. సర్వే డేటా భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం దిశా నిర్దేశం చేశారు.

**శాశ్వత భూహక్కు- భూరక్ష పథకంపై సీఎం సమీక్ష**
**బొగ్గు కొనుగోలుకు నిధుల కొరత లేదు: జగన్**



సమగ్ర భూ సర్వే పనుల్లో ప్రగతిని, లక్ష్యాలను సీఎంకు వివరించిన అధికారులు

పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన 51 గ్రామాల్లో సర్వే పూర్తి

డిసెంబర్ 2021 నాటికి మరో 650 గ్రామాల్లో పూర్తి

మండలానికి ఒక గ్రామం చొప్పున ఈ 650 గ్రామాల్లో సర్వే పూర్తి చేస్తామన్న అధికారులు

జూన్ 22, 2022 నాటికి 2400 గ్రామాల్లో సర్వే పూర్తిచేస్తామన్న అధికారులు

మరో 2400 గ్రామాల్లో ఆగస్టు 2022 నాటికి పూర్తి అవుతుందని వెల్లడి

మొత్తంగా ఆగస్టు 2022 నాటికి 5500 గ్రామాల్లో సర్వే పూర్తయినట్టవుతుందన్న అధికారులు

అక్టోబరు 2022 నాటికి 3 వేల గ్రామాల్లో, మరో 3వేల గ్రామాల్లో డిసెంబరు 2022 నాటికి, మరో 3వేల గ్రామాల్లో మార్చి 2023 నాటికి సర్వే పూర్తి చేస్తామన్న అధికారులు **(మిగతా 2లో..)**

## బహుజనుల ఆర్థిక పురోగతి కోసమే..

# “స్నేహ దీక్ష పథకం”



**విశాఖపట్నంలో...**

బహుజనుల ఆర్థికాభివృద్ధి కోరకు “ స్నేహ దీక్ష” పథకాన్ని ప్రారంభించామని విశాఖ స్నేహ మాక్స్ సి. ఇ. వో. మనోరంజన్ అన్నారు.భారత దేశ చరిత్ర లో అక్టోబర్ 14న విశిష్ట మైన ప్రాధాన్యత ఉందన్నారు.నాగ్ పూర్ లో ఆరు లక్ష ల మంది తో అక్టోబర్ 14న భోది సత్య డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ దమ్మ దీక్షను తీసుకున్నారన్నారు. అక్టోబర్ 14న ఏ కార్యక్రమం చేపట్టినా, విజయవంతం అవుతుందని బహుజనుల, బౌద్ధుల నమ్మకం అన్నారు. ప్రతి ఏడాది అక్టోబర్ 14 న కోట్లాది మంది జనం నాగ్ పూర్ దీక్షా భూమికి వెళ్తున్నారని అన్నారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన రోజున స్నేహ దీక్ష పథకాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు. స్నేహ మాక్స్ డైరెక్టర్, స్నేహ క్లబ్ ఇంచార్జ్ అల్లాడి పున్నారావు మాట్లాడుతూ స్నేహ దీక్ష పథకం బహుజనులకు ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు.వారానికి వంద రూపాయలు చొప్పున ఏడు సంవత్సరాలు కడితే,14 వ సంవత్సరం లో లక్ష రూపాయలు రావడం తో పాటు ఇన్సూరెన్స్ సదుపాయం కూడా ఉందన్నారు. ఈ, డిపాజిట్స్ కుటుంబ ఆర్థిక అభివృద్ధి కోసం, విద్య వైద్య, ఉద్యోగాలు వ్యాపారానికి, పెళ్లిళ్లు,

**(మిగతా 2లో..)**



**హైదరాబాద్ లో ...**

స్నేహ దీక్ష పథకం పేదలకు వరం లాంటిదన్నారు స్నేహ సంస్థల చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు . స్నేహ సంస్థల కేంద్ర కార్యాలయం హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో ఆయన స్నేహ దీక్ష పథకాన్ని ప్రారంభించి పథకంలో భాగస్వామ్యులైన స్నేహ సంస్థల సిబ్బందికి పథకానికి సంబంధించిన రసీదులు అందజేశారు . ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి ఆర్ అంబెద్కర్ బోధిసత్వ ధమ్మ దీక్ష తీసుకున్న పర్వదినాన ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు . పే బ్యాక్ టు సొసైటీ అన్న అంబేద్కర్ మాటలు ఆదర్శంగా ప్రారంభించిందే స్నేహ క్లబ్ అని , ఈ క్లబ్ ద్వారా బహుజనులకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ , పలు అనుబంధ సంస్థలను ప్రారంభించడం జరిగిందన్నారు . ప్రతీ బహుజన కుటుంబాన్ని లక్షాధికారిగా చూడాలన్న ఆయన తలంపుతో ఈ పథకం అమలు పరుస్తున్నామన్నారు .



# మరిన్ని సర్జికల్ స్ట్రైక్స్...

## పాక్‌కు అమిత్ షా హెచ్చరిక...



న్యూఢిల్లీ,అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: దాడి చేసినవారితో కూర్చుని చర్చించే రోజులు ఒకప్పుడు ఉండేవని, ఇవి ఉగ్రవాద దాడులకు దీటైన జవాబు చెప్పే రోజులని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. గోవాలోని ధర్బండోరాలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీకి గురువారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, 2016లో నిర్వహించిన సర్జికల్ స్ట్రైక్స్‌ను గుర్తు చేస్తూ, పాకిస్థాన్‌ను హెచ్చరించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అప్పటి రక్షణ మంత్రి మనోహర్ పారికర్ హయాంలో సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించడం చాలా ముఖ్యమైన విషయమని అమిత్ షా చెప్పారు. భారత దేశ సరిహద్దులకు ఎవరూ విఘాతం కలిగించలేరనే సందేశాన్ని పంపించామని చెప్పారు. గతంలో చర్చలు జరిపేవారమని, కానీ ప్రస్తుతం ‘తిరిగి ఇచ్చే’ సమయం వచ్చిందని చెప్పారు. మనోహర్ పారికర్ గోవాకు చెందినవారే. ఆయన సేవలను ప్రస్తావిస్తూ అమిత్ షా ఈ హెచ్చరిక చేశారు. పూంఛ్‌లో ఉగ్రవాదులు దాడి చేసినపుడు, భారత దేశం సర్జికల్ స్ట్రైక్స్ రూపంలో దీటుగా సమాధానం చెప్పిందన్నారు.

# దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన టీటీడీ



విజయవాడ,అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: దసరా నవరాత్రుల సందర్భంగా బెజవాడ దుర్గమ్మకు టీటీడీ అర్చకులు సారె సమర్పించారు. టీటీడీ అధికారులు, అర్చకులకు దుర్గగుడి ఆలయ ఈవో భ్రమరాంబ,ఆలయ ఛైర్మన్ పైలా సోమినాయుడు,అధికారులు స్వాగతం పలికారు. దసరా ఉత్సవాల్లో టీటీడీ నుంచి పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. మహిషాసురమర్దినీదేవి అలంకరణలో ఉన్న దుర్గమ్మను టీటీడీ బోర్డు మెంబర్లు దర్శించుకున్నారు.

# తైవాన్‌లో ఘోర అగ్నిప్రమాదం..

## 46 మంది సజీవ దహనం





తైపేయి: తైవాన్‌లోని ఓ భవనంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 46 మంది మృత్యువాత పడ్డారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. గురువారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో కావోసియుంగ్ నగరంలోని 13 అంతస్తుల భవనంలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే రంగంలోకి దిగిన **(మిగతా 2లో..)**

పాఠకులకు, ప్రకటనకర్తలకు మరియు శ్రేయోభిలాషులకు
విజయదశమి శుభాకాంక్షలు
విజయదశమి సందర్భంగా నేడు మా ప్రజాపాలన సెలవు
రేపు సంచిక వెలువడదు పునర్దర్శనం ఆదివారం
... ఎడిటర్










## లక్ష్యంలోగా...

# సర్వేను పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

జూన్, 2023 నాటికి మరో 3 వేల గ్రామాలతో కలుపుని.. మొత్తంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో సర్వే పూర్తిచేస్తామన్న అధికారులు.

పైలెట్ ప్రాజెక్టు సర్వే

పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే 51 గ్రామాల్లో 30,679 కమతాలను సర్వే చేశామన్న అధికారులు

3549 పట్టాదారుల వివరాలను అప్‌డేట్ చేశామన్న అదికారులు

రెవిన్యూ నుంచి 572 , సర్వే వైపు నుంచి వచ్చిన 1480 అభ్యర్థనలను పరిష్కరించామన్న అధికారులు.

235 సరిహద్దు వివాదాలను పరిష్కరించామన్న అధికారులు.

సంబంధిత రికార్డులను అప్‌డేట్ చేయడమే కాకుండా వాటిని స్వచ్ఛీకరించామని తెలిపిన అధికారులు.

సర్వే పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు, మ్యాపులతో కూడిన పట్టాదారు పుస్తకాన్ని రైతులకు అందిస్తున్నామన్న అధికారులు.

ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ ఏమన్నారంటే...:

క్రయ విక్రయాల సమగ్ర డేటా అప్‌డేట్ కావాలి: సీఎం ఆదేశం

భూముల క్రయ విక్రయాలు జరిగినప్పుడు పట్టాదారు పుస్తకానికి సంబంధించి అమ్మిన వ్యక్తి రికార్డుల్లోనూ, కొనుగోలు చేసిన వ్యక్తి రికార్డుల్లోనూ అప్‌డేట్ కావాలన్న సీఎం

అప్పుడే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినట్టుగా భావించాలి: సీఎం.

దీనిపై ప్రత్యేక టీంను పెట్టి.. తగిన విధానాన్ని రూపొందించాలన్న సీఎం.

ల్యాండు రికార్డుల్లో నిపుణులైన వారిని, న్యాయపరమైన అంశాల్లో అనుభవం ఉన్నవారిని ఈ టీంలో పెట్టాలన్న సీఎం.

వీరు ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలకు సంబంధించి ఎస్ఓపీలు రూపొందించాలన్న సీఎం.

గ్రామ సచివాలయాల్లోనే ఈప్రక్రియ పూర్తయ్యేలా ఉండాలి: సీఎం ఆదేశాలు.

ప్రజలు వీటికోసం ఆఫీసులు చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా తగిన ఎస్ఓపీ రూపొందించాలని సీఎం ఆదేశాలు.

ల్యాండ్ సర్వేను పూర్తిచేయడానికి తగినంత సాంకేతిక పరికరాలను సమకూర్చుకోవాలని సీఎం ఆదేశం.

తగినన్ని డ్రోన్లు పెట్టుకోవాలన్న సీఎం.

సర్వేకు సంబంధించి డేటా భద్రతపైనా తగిన చర్యలు తీసుకోవాలన్న సీఎం.

దీనిపై అనుభవం ఉన్న వ్యక్తులు, సంస్థలతో మాట్లాడాలని అధికారులకు సీఎం ఆదేశం.

ల్యాండ్ రికార్డుల అప్‌డేషన్‌ను ప్రతి ఏటా ఒక వారంలో చేపట్టాలని సీఎం ఆదేశం.

దీనిపై తగిన కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశం.

ల్యాండు రికార్డుల అప్‌డేషన్, రిజిస్ట్రేషన్ తదితర ప్రక్రియలన్నీ అత్యంత పారదర్శకంగా ఉండాలన్న సీఎం

మనం తీసుకొస్తున్న సంస్కరణల కారణంగా ఎక్కడా అవినీతికి చోటులేని విధంగా, రైతులకు, భూయజమానులకు మేలు చేసేలా ఉండాలన్న సీఎం.

సమర్థవంతమైన మార్గదర్శకాలను తయారు చేయాలని సీఎం ఆదేశం.

గత ప్రభుత్వ హయాంలో నిషేధిత భూముల అంశానికి సంబంధించి రికార్డుల్లో చోటుచేసుకున్న వ్యవహారాలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్న సీఎం.

22ఎ కి సంబంధించి అనేక వ్యవహారాలు బయటకు వస్తున్న నేపథ్యంలో ఇలాంటి వాటికి చెక్ పెట్టాల్సిన అవసరం ఉందన్న సీఎం.

అధికారులు కూర్చొని దీనిపై ఒక విధానం తీసుకురావాలి: సీఎం

ఇలాంటి తప్పిదాలు, పొరపాట్లు, ఉద్దేశపూర్వక చర్యలు పునరావృతం కాకుండా చూడాలన్న సీఎం.

తగినన్ని మార్గదర్శకాలు పటిష్టంగా రూపొందించాలన్న సీఎం.

నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలన్నా, ఆ జాబితాలో పెట్టాలన్నా అనుసరించాల్సిన విధానాన్ని లోపాలు లేకుండా తీసుకురావాలన్న సీఎం.

దీనికి సంబంధించి ఆధీకృత వ్యవస్థను కూడా బలోపేతంచేయాలి : అధికారులకు సీఎం నిర్దేశం

ఈ సమీక్షా సమావేశానికి ఉప ముఖ్యమంత్రి (రెవెన్యూశాఖ) ధర్మాన కృష్ణదాస్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లాం, సీఎస్ డాక్టర్ సమీర్ శర్మ, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నీరబ్ కుమార్ ప్రసాద్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, రెవెన్యూశాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, గృహనిర్మాణాశాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ ఎస్ రావత్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి వి ఉషారాణి, రెవెన్యూశాఖ కమిషనర్ (సర్వే, సెటిల్‌మెంట్స్) సిద్దార్థ జైన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కోన శశిధర్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ కమిషనర్ ఎం ఎం నాయక్, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఏపీఎండీసీ వీసీ అండ్ ఎండీ వీ జీ వెంకటరెడ్డి ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**దేశంలో బొగ్గు నిల్వలు ఎక్కడున్నా కొనుగోలు చేయాలి**


ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ పరిస్థితులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. థర్మల్ కేంద్రాల నుంచి కరెంటు ఉత్పత్తి, బొగ్గు నిల్వలపై అధికారులతో సమీక్షించారు. థర్మల్ కేంద్రాలను పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలో బొగ్గు నిల్వలు ఎక్కడున్నా కొనుగోలు చేయాలన్నారు. బొగ్గు కొనుగోలుకు నిధుల కొరత లేదని సీఎం స్పష్టం చేశారు. థర్మల్ కేంద్రాల్లో ఉత్పత్తిని ప్లాంట్ల సామర్థ్యం మేరకు పెంచాలన్నారు. కృష్ణపట్నం, వీటీపీఎస్‌ల్లో ఉన్న కొత్త యూనిట్లలో వెంటనే ఉత్పత్తి ప్రారంభించాలని, తద్వారా 1600 మెగావాట్ల విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సింగరేణి సంస్థతో కూడా సమన్వయం చేసుకుని అవసరాలమేరకు బొగ్గును తెప్పించుకోవాలని సీఎం సూచించారు. కేంద్రంలోని సంబంధిత మంత్రిత్వశాఖలు, ఏజెన్సీలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు. కరెంటు కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు.




## బహుజనుల ఆర్థిక పురోగతి కోసమే..

# “స్నేహ దీక్ష పధకం”





(మొదటి పేజీ తరువాయి)

ఇల్లు నిర్మాణానికి ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుందన్నారు. కార్యమానికి ముందు స్నేహ దీక్ష బ్రోచర్‌ను అతిధులు అవిష్కరించారు ఈ కార్యక్రమం లో స్నేహ మాక్స్,డైరెక్టర్ జె. సి ప్రకాష్, కార్యాలయ సిబ్బంది, స్నేహ మాక్స్ మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

**డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్ సుబ్బారావు మాట్లాడుతూ ..** డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ సుమారు ఆరు లక్షల మందితో నాగపూర్ లో బౌద్ధ మతం స్వీకరించిన సుదినాన ఈ పథకం ప్రారంభిస్తున్నామని, ఇది పేద ప్రజలకు వరం లాంటిదని , వారానికి వంద రూపాయల చొప్పున ఏడు సంవత్సరాల వరకు డిపాజిట్ చేస్తే 14 సంవత్సరాల తరువాత లక్ష రూపాయల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు . ఈ పథకం లో లోన్ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు . ఈ పథకం లో ప్రతీ సభ్యుడికి ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు . ఈ కార్యక్రమంలో అంబెడ్కర్ టివి డైరెక్టర్ పద్మ శర్మ తో పాటు డాక్టర్ నిరంజన్ , స్నేహ , అంబేద్కర్ టివి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



నరసాపురం, అక్టోబర్ 14 (ప్రజాపాలన ప్రతినిధి) : మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా వైయస్సార్ ఆసరా పథకానికి శ్రీకారం చుట్టామని అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని నరసాపురం శాసన సభ్యులు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. స్థానిక మున్సిపల్ ఓపెన్ థియేటర్ ప్రాంగణంలో గురువారం పట్టణంలోని 11 నుంచి 31 వార్డులకు సంబంధించి రెండవ విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరాతో పాటు ఆసరా ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నామని మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని మహిళలకు పీఅండ్‌జీ, హెచ్‌యూఎల్ లాంటి మల్టీనేషనల్ కంపెనీల ద్వారా చేయూత అందిస్తామని అన్నారు. పసిపిల్లల నుంచి అవ్వ, తాతల వరకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తల్లి, బిడ్డలకు పౌష్టికాహారం అందించేలా వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్, ఆరేళ్ల పిల్లల నుంచి ఇంటర్ విద్యార్థుల చదువుల కోసం అమ్మఒడి అమలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7.97 లక్షల స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 78.76 లక్షల మంది మహిళలకు రూ.6వేల 4వందల 40 కోట్లు రెండోవ విడత ఆసరా పంపిణీ చేస్తున్నారని అన్నారు. పొదుపు సంఘాల పేరిట బ్యాంకుల్లో ఉండే అప్పుమొత్తం తమ ప్రభుత్వమే భరిస్తుందన్న మాటను ముఖ్యమంత్రి జగన్ నిలబెట్టుకుంటున్నారని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి చేసిన వంచనవలన మహిళలు రూ.3వేల కోట్లకు పైగా బ్యాంకులకు అధనంగా చెల్లించాల్సి వచ్చిందని ఆరోపించారు. జగనన్న ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని మరోసారి నిరూపించారని శాసన సభ్యులు అన్నారు. దిశా చట్టం కేంద్ర ఆమోదం లభించాల్సి ఉండడంతో అంతకు ముందే దిశాయాప్ తో భద్రత కల్పించాలని చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో 3,785 స్వయం సహాయక సంఘాలు మహిళలకు రూ 38.56 కోట్ల రూపాయలు రెండోవిడత ఆసరా సొమ్మును వారి బ్యాంకుఖాతాలో జమచేయడం జరిగిందని ఆయన వివరించారు.మీరందరు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వృద్ధి చెందాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని మహిళలు ఆర్థికాభివృద్ధి కోసం వైఎస్ఆర్ చేయూత సాయంతో పాటు సాంకేతిక, బ్యాంకింగ్, మార్కెటింగ్, శిక్షణ వంటి సహకారాలు అందిస్తూ జీవనోపాధి కల్పిస్తున్నామని ఇందుకోసం పలు ప్రముఖ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహాసంఘం చైర్ పర్సన్ బర్రి లీల, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీ వెంకటరమణ, ఏఎంసి చైర్మన్ కొల్లాబత్తుల రవికుమార్, జడ్పీటీసీలు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాబ్జి, వైస్ చైర్ పర్సన్ కామన నాగిని, వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, పార్టీ నాయకులు భూసారపు జయప్రకాష్, మావూరి సత్యనారాయణ, కావలి నాని, దొండపాటి స్వామి, గోరు సత్తిబాబు, షేక్ బుల్లిమస్తాన్, పలువురు పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# తైవాన్‌లో ఘోర అగ్నిప్రమాదం..

(మొదటి పేజీ తరువాయి)

అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు 55 మందిని ఆసుపత్రికి తరలించారు. వీరిలో 14 మంది పరిస్థితి విషమంగా ఉంది. అగ్నికీలలు భయంకరంగా ఎగసిపడుతున్నట్టు అధికారులు తెలిపారు. భవనంలో చాలా అంతస్తులు పూర్తిగా ధ్వంసమైనట్టు అగ్నిమాపక అధికారులు తెలిపారు. భవనం నుంచి పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడుతున్న వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పొగలు ఆ ప్రాంతాన్ని దట్టగా కమ్మేశాయి. మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రమాదానికి కారణం ఏంటన్న విషయం తెలియరాలేదు. అయితే, తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో భారీ పేలుడు శబ్దం వినిపించినట్టు ప్రత్యక్ష సాక్షిని ఉటంకిస్తూ స్థానిక మీడియా పేర్కొంది. భవనం 40 ఏళ్ల పాతదని, భవనం కింది అంతస్తుల్లో దుకాణాలు ఉండగా, పైన అపార్ట్‌మెంట్లు ఉన్నాయని అధికారులు తెలిపారు.

# మరిన్ని సర్జికల్ స్ట్రైక్స్...

(మొదటి పేజీ తరువాయి)

ఇది నూతన అధ్యాయానికి నాంది అని తెలిపారు. (ఉగ్రవాదుల) భాషలోనే తాము సమాధానం చెబుతామనే సందేశాన్ని భారత దేశం పంపించిందని చెప్పారు. కొద్ది రోజులుగా జమ్మూ-కశ్మీరులో ఉగ్రవాద దాడులు పెరుగుతున్న సంగతి తెలిసిందే. ఉగ్రవాదులు హిందువులు, సిక్కులను గుర్తించి మరీ చంపుతున్నారు. ఈ విషయాన్ని ఇటీవల శ్రీనగర్‌లోని ఈద్గా ప్రాంతంలో ఓ ప్రభుత్వ పాఠశాల టీచర్ చెప్పారు. ఈ పాఠశాల ప్రిన్సిపాల్‌ను, టీచర్‌ను ఉగ్రవాదులు వారి ఐడెంటిటీ కార్డులు తనిఖీ చేసి మరీ చంపారని ఆ టీచర్ చెప్పారు. ఈ నేపథ్యంలో అమిత్ షా మరిన్ని సర్జికల్ స్ట్రైక్స్ రూపంలో సమాధానం చెబుతామని పాకిస్థాన్‌ను హెచ్చరించారు. ఉరిపై ఉగ్రవాద దాడిపై స్పందిస్తూ, 2016 సెప్టెంబరులో భారత సైన్యం నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రైక్స్ చేసిన సంగతి తెలిసిందే.

### స్వచ్ఛ పొన్నూరు సాకారం కోసం ప్రజల సహకారం కావాలి

పొన్నూరు అక్టోబర్ 14ప్రజాపాలన ప్రతినిధిపొన్నూరు పట్టణాన్ని స్వచ్ఛంగా ఉండేలా చేయడానికి ప్రజల సహకారం కావాలని మునిసిపల్ కమిషనర్ రాధ పేర్కొన్నారుగురువారం ఆమె కార్యాలయంలో తనను కలవడానికి వచ్చిన మైనారటీ నాయలులతో ఆమె సమావేశమయ్యారు.పారిశుధ్యానికి తొలి ప్రాధాన్యత ఇచ్చి పని చేస్తున్నామన్నారు.పర్యావరణ పరిరక్షణ పారిశుధ్యం కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. మైనారిటీ నాయకుడు షేక్ నాజర్ కమిషనర్ వినతిపై సానుకూలంగా స్పందించి తన వంతు సహకారంగా 300 డస్ట్ బిన్లు అందిస్తానని హామీ ఇచ్చారు.



## ఆదర్శప్రాయుడు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం, అక్టోబర్ 14 (ప్రజాపాలన ప్రతినిధి) : భీమవరం శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా గురువారం ఆయన అభిమానులు కాయల వీర వెంకట సత్యనారాయణ (కుప్పనపూడి బుజ్జి), తోట సూరిబాబు, ముత్యాల చంద్రం, దండిపాటి మావుళ్ళు ఆధ్వర్యంలో రెండువందల మంది పేదలకు గురువారం బిర్యానీ పొట్లాలను, పండ్లను అందించారు. ఈ సందర్భంగా కాయల వీరవెంకట సత్యనారాయణ మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లోనే ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారం చేస్తూ భీమవరం పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్న శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ భగవంతుని ఆశీస్సులతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని నియోజకవర్గానికి ఆయన మరిన్ని సేవలు అందించాలని అన్నారు. రానున్న రోజుల్లో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆయనసేవలు భీమవరం నియోజకవర్గానికే పరిమితం కాకుండా మంత్రివర్గంలో చేరి రాష్ట్రస్థాయిలో ఆయనసేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. కుల రహిత, అవినీతి రహిత పాలన అందించడంలో శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎర్ర బాబు, ప్రసాద్, గ్రంధి శ్రీనివాస్ అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు, ఆడపడుచులకు విజయదశమి శుభాకాంక్షలు

**రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య**

పొన్నూరు అక్టోబర్14 ప్రజాపాలన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు, ఆడపడుచులకు, ప్రత్యేకించి నియోజకవర్గ సోదర సోదరీ మణులకు వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య విజయదశమి శుభాకాంక్షలను తెలియజేశారు. శరన్నవరాత్రి మహోత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో ఆనందోత్సాహాల నడుమ మన మందరం జరుపుకోవటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అసత్యంపై సత్యం విజయం సాధించిన రోజు, అధర్మంపై ధర్మం విజయం సాధించిన రోజు, చెడుపై మంచి విజయం సాధించిన రోజు ఈ విజయదశమి రోజని చెప్పారు. ఆ దేవి కరుణాకటాక్షాలతో దుర్గతులు దూరం కావాలని, ప్రతికార్యంలోనూ సర్వత్రా విజయం సాధించాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో సిరిసంపదలతో తులతూగాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



## రాష్ట్ర అభివృద్ధి జగనన్నకే సాధ్యం



బంటుమిల్లి (పెడన) అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కె సాధ్యమని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుల వల్లభనేని బాలశౌరి అన్నారు కృష్ణాజిల్లా పెడన మండలం ఉరివి గ్రామంలో జరిగిన వైయస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా పెడన శాసనసభ్యులు జోగి రమేష్ తో కలిసి పలు రహదారులు శంకుస్థాపన లకు కూడా శ్రీకారం చుట్టారు రాష్ట్రం లో బడ్జెట్ లో ఉన్న కరోనా తాండవిస్తున్న ఇచ్చిన మాటకు కట్టుబడి రెండవ విడత అక్కాచెల్లెమ్మలన ఖాతాలో జమ చేయనున్నారని తెలిపారు పెడన మండలం నడుపూరు నుండి ముదినేపల్లి మండలం కొత్తపల్లి వరకు యాభై మూడు కోట్ల 86 లక్షల వ్యయంతో ఆర్ అండ్ బి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు అలాగే నడుపూరు నుండి ఆర్ వి పల్లి గ్రామాల మధ్య కోటి 30 లక్షల వ్యయంతో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు ఎంపీ బాలశౌరి చాలా రోజుల తర్వాత సుడిగాలి పర్యటన చేయడంతో అడుగడుగున మహిళలు హారతులు ఇస్తూ ఘనంగా పూలదండ దుశ్శాలువతో డ్వాక్రా మహిళలు వైసీపీ నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు పలుచోట్ల ఎంపీ బాలశౌరి ని ఎమ్మెల్యే జోగి రమేష్ లను గజమాలతో సత్కరించారు వచ్చిన డ్వాక్రా మహిళల తో ఉరివి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది ఈ కార్యక్ర వైసిపి నాయకులు కార్యకర్తలు వివిధ ప్రభుత్వ ఉద్యోగులు డ్వాక్రా మహిళలు వాలెంటర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు

## ప్రతి ఒక్కరూ విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో భాగస్వాములు కావాలి: ప్రభుత్వ విప్ ఉదయభాను



జగ్గయ్యపేట అక్టోబర్ 14 ప్రజా పాలన ప్రతినిధి:తెలు గువారు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మా గార పరిరక్షణ ఉద్యమంలో ప్రతిఒక్కరూ భాగస్వా ములు కావాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభాను అన్నారు. గురువారం పట్టణంలోని వారి స్వగృహంలో జగ్గయ్య పేట విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ కార్మికులు కొనసాగిస్తున్న ఉద్యమా నికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుండి సంపూర్ణ మద్ద తు తెలియజేయడం జరిగిందని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ ఉ ద్యమానికి మద్దతు తెలిపారని అన్నారు. రాష్ట్ర ము ఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉ క్కు ప్రైవేటీ కరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారని గుర్తు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయాలన్న కేంద్ర ప్రభుత్వం ని ర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ప్ర తిఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, నవీన్ కుమార్, ప్రసాద్ బాబు, లకావత్ దేవోజీ, చంద్రశేఖర్, భాస్కర్, రవితే జ, తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడత వైయస్ఆర్ ఆసరా పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు



కంచికచర్ల అక్టోబర్ 14 ప్రజా పాలన ప్రతినిధి: పట్ట ణంలోని ఓసీ క్లబ్ లో ఏర్పాటుచేసిన మండల పరిధి లోని డ్వాక్రా సంఘాలకు రెండో విడత వైయస్సార్ ఆ సరా పంపిణీ కార్యక్రమంలో శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు పాల్గొని మహిళా సంఘాలకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎ మ్మెల్యే డాక్టర్ జగన్ మోహన్ రావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్ ఆసరా వారోత్సవాలు పం డుగ వాతావరణంలో సాగుతున్నాయని ,మహిళలు ఊరూరా సభలు పెట్టి సీఎం వైఎస్ జగన్ ఫోటోలకు పాలాభిషేకం చేస్తూ తమ కృతజ్ఞతలు తెలుపుతున్నా రని చెప్పారుగత అసెంబ్లీ ఎన్నికల నాటికి పొదుపు సంఘాలలోని మహిళల పేరుతో ఉన్న బ్యాంకు అప్పు లు ప్రభుత్వమే భరిస్తూ ఆ మొత్తాన్ని వైఎస్ఆర్ ఆస రా పథకం ద్వారా నాలుగు విడతల్లో రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని ,రెండో విడతకు సంబంధించి ఈ నెల ఏడో తేదీ నుండి 10 రోజుల పాటు సంబంధిత సంఘా లకు ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుందన్నారు ఈ కా ర్యక్రమంలో కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ,కంచికచర్ల ఎంపీపీ ,వైస్ ఎంపీపీ, జెడ్ పి టి సి ,గ్రామ సర్పంచ్ ,ఎంపీడివో ,మండల పార్టీ కన్వీనర్ ,ప లు గ్రామాల సర్పంచులు ,మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ,పొదుపు సంఘాల లీడర్లు ,డ్వాక్రా మ హిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మహిళల స్వయం సమృద్ధికే వై.యస్.ఆర్. ఆసరా పథకం:మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాదు "



మైలవరం అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: వై.యస్.ఆర్.ఆసరా 2 వ విడత సంబరాలులో భాగంగా బుధవారం సాయంత్రం జి కోండూరు మండలం గంగినేని సచివాలయం పరిధిలో డ్వాక్రా సంఘాల అక్క చెల్లెమ్మ లతో సమావేశం నిర్వహించారు.లిఈ సమావేశం లో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాదు మాట్లాడుతూ గంగినేని పంచాయతీ పరిధిలోని సున్నంపాడు, తెల్లదేవరపాడు, దుగ్గిరాలపాడు గ్రామాల్లో 96 సంఘాలకు చెందిన 9600 మంది లబ్ధిదారులకు 79, 42,528 రూపాయలు ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారులిమహిళలు అన్ని విధాలుగా ఆర్థికంగా సామాజికంగా ఏదిగేందుకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మహిళల పక్షపాతిగా నిలిచారని అన్నారులిఈ సందర్భంగా మహిళలకు ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. అక్క చెల్లెమ్మ లకు దసరా శుభాకాంక్షలు తెలిపారులిఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచులు పిల్లి రామారావు, దేశం సుధాకరరెడ్డి , జడ రాంబాబు, రవీంద్ర బాబు, ఉమ్మడి ప్రసాదు, పగడాల వెంకటేశ్వరరావు యంపిపి వేములకోండ తిరుపతమ్మ , వైస్ యంపిపీ ఈలప్రోలు తేజస్విని, మండల పార్టీ అధ్యక్షుడు మందా జక్రధరరావు , సొసైటీ అధ్యక్షులు చుండూరు విష్ణువర్దన రావు, పిల్లి ప్రసాదు స్థానిక నాయకులు వైయస్సార్ క్రాంతి పథం సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

## మహిషాసుర మర్ధనీదేవి గా బెజవాడ కనకదుర్గమ్మ



విజయవాడ, అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: దసరా మహోత్సవాల్లో భాగంగా బెజవాడ కనకదుర్గమ్మ 8వ రోజు గురువారం శ్రీ మహిషాసుర మర్ధనీదేవి అవతారం భక్తులకు దర్శనమిస్తుంది. రాక్షసులను సంహరించి స్వయంభుగా వెలిసిన మహిషాసుర మర్ధనీ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అష్టభుజాలతో అవతరించి సింహవాహినియై దుష్టుడైన మహిషాసురుడిని సంహరించింది. మహిషాసుర మర్ధనిని దర్శించుకుంటే అరిషడ్వర్గాలు నశించి, సాత్విక భావం ఏర్పడుతుందని,సర్వదోషాలు పటాపంచలై ధైర్య, స్థైర్య, విజయాలు చేకూరుతాయని భక్తుల విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇక రేపటితో దసరా వేడుకలు ముగియనున్నందున ఇంద్రకీలాద్రికి భక్తుల తాకిడి పెరిగింది.

## ఆర్వోల నియామకాలకు పుర, నగరపాలక సంస్థల ప్రతిపాదనలు

### ఖాళీ స్థానాల్లో మళ్లీ ఎన్నికలకు సన్నాహాలు

అమరావతి,అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రంలోని పుర, నగరపాలక సంస్థల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు మృతి చెందడంతో ఖాళీ అయిన స్థానాల్లో తిరిగి ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. అన్ని చోట్ల నుంచి ఖాళీల వివరాలు సేకరించి వీటిలో ఎన్నికల అధికారుల(ఆర్వో)ను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది మార్చి 10న నిర్వహించిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల తరువాత పలు కారణాలతో నగరపాలక సంస్థల్లో 12 మంది కార్పొరేటర్లు మృతి చెందారు. వీరిలో కాకినాడ నగరపాలక సంస్థలో నలుగురు, విశాఖ, ఏలూరులో చెరో ఇద్దరు, విజయనగరం, మచిలీపట్నం, గుంటూరు, అనంతపురంలో ఒకరు చొప్పున మరణించారు. పురపాలక సంఘాల్లో 14 మంది కౌన్సిలర్లు మృతి చెందారు. ఈ స్థానాలకు ఇప్పటికే ఓటర్ల జాబితాలు ప్రచురించారు. పోలింగ్ కేంద్రాలు, ఇతరత్రా ఏర్పాట్ల కోసం ఆర్వోల పేర్లను సూచిస్తూ కమిషనర్లు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపారు. వీరి నియామక ప్రక్రియ పూర్తయి ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు పుర, నగరపాలక సంస్థలు నివేదించాక ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇస్తుంది. సాధ్యమైనంత వేగంగా ఎన్నికలు నిర్వహించే యోచనతో ఎన్నికల సంఘం ఉన్నట్లు తెలుస్తోంది.

## రాజ్యాంగ నిర్మాత డా.బీ.ఆర్. అంబేద్కర్ బౌద్ధం తీసుకుని 65 సంవత్సరాలు

### తేతలి గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి



తణుకు, ప్రజాపాలన ప్రతినిధి : రాజ్యాంగ నిర్మాత డా.బీ.ఆర్. అంబేద్కర్ బౌద్ధం తీసుకుని 65 సంవత్సరాలు అయిన సందర్భంగా తణుకు నియోజకవర్గ పరిధిలోని తేతలి గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో వాయిస్ ఆఫ్ దళిత్ వ్యవస్థాపకుడు అరిగెల రాజేష్, ఏలిపే సురేష్ అధ్యక్షతన సభ నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావిగా పేరు గాంచారని తెలిపారు. సరిగ్గా ఇదేరోజున అంబేద్కర్ కులనిర్మూలన కోసం బౌద్ధం తీసుకున్నారని గుర్తుచేశారు. ఈ దేశంలో కులనిర్మూలన జరగాలని అంబేద్కర్ ఆశించారన్నారు. అంబేద్కర్ ఆశించిన సమాజ స్థాపనకై వాయిస్ ఆఫ్ దళిత్ టీమ్ చేస్తున్న కృషిని క్రాంతిబాబు కొనియాడారు. అంబేద్కర్ వారసులుగా యువత కుల వివక్షలపై, అంటరాని తనంపై పోరాడాలని పిలుపునిచ్చారు. దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని,ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసులలో అరెస్ట్ చేసిన దోషులకు 41 సి.ఆర్.పి.సి క్రింద స్టేషన్ బెయిల్ ఇచ్చి ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో వాయిస్ ఆఫ్ దళిత్ మరియు తేతలి అంబేద్కర్ యూత్ సభ్యులు మద్దిల ఏసు, సాక ఆనంద్, సురేష్, , అజయ్, మురళి, పౌలు, గోపి, జాన్ , పండు , కెవిపిఎస్ జిల్లా నాయకులు బత్తుల విజయ్ కుమార్, తూరుగోపు వెంకటేశ్వరరావు మరియు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ శాఖల ఎఫ్‌డీలలో నిధుల గల్లంతుపై 2 పీఎస్‌లలో ఫిర్యాదులు

విజయవాడ,అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: ఏపీలో ప్రభుత్వ శాఖల ఎఫ్‌డీలలో నిధుల గల్లంతుపై రెండు పీఎస్‌లలో ఫిర్యాదులు నమోదయ్యాయి. ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌లో రూ.9 కోట్లు కొల్లగొట్టిన ఘటనపై భవానీపురంలో ఫిర్యాదు చేశారు. ఏపీ ఆయిల్‌ఫెడ్‌లో రూ.5 కోట్లు కొట్టేసిన ఘటనపై ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఐఓబి, సప్తగిరి బ్యాంక్‌లలో ఉన్న ఎఫ్‌డీలను నిందితులు తమ సొంత అకౌంట్లకు తరలించారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ డాక్యుమెంట్లు, అదనపు సమాచారం కోరినట్లు పోలీసులు తెలిపారు. గల్లంతైన సొమ్ము చెల్లించేందుకు సూత్రప్రాయంగా అంగీకరించిన ఆయా బ్యాంకు యాజమాన్యాలు ప్రభుత్వ శాఖల నుంచి వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు మొదలు పెట్టినట్లు అధికారులు తెలిపారు.

## రాష్ట్ర ప్రజలందరికీ దసరా పర్వదిన శుభాకాంక్షలు - రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి అక్టోబర్ 14: రాష్ట్ర ప్రజలందరికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. గురువారం కృష్ణాజిల్లా గుడివాడ పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి కొడాలి నాని మీడియాతో మాట్లాడారు. హిందువుల ముఖ్యమైన పండుగల్లో దసరా పండుగ ఒకటని, తొమ్మిది రోజుల పాటు దేవీ నవరాత్రులు, పదవ రోజు విజయదశమితో కలిపి దసరా పండుగను జరుపుకుంటారన్నారు. దేవితో తలపడిన అసురుడు మహిషి రూపంలో హతుడయ్యాడని, మహిషుని సంహరించిన రోజును దసరా పర్వదినంగా దేశమంతా జరుపుతూ వస్తున్నారని తెలిపారు. గత రెండేళ్ళుగా ప్రజలను కరోనా మహమ్మారి పట్టి పీడిస్తోందని, అమ్మవారి కృపతో కరోనా కష్టాలు తొలగిపోవాలని కోరుకున్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం జగన్మోహనరెడ్డికి ఆశీస్సులను అమ్మవారు అందించాలని ప్రార్థించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి మంత్రి కొడాలి నాని దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

## మారుతున్న సమీకరణాలు

విజయవాడ, అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో త్వరలోనే సమీకరణాలు మారబోతున్నాయి. తెలుగుదేశం పార్టీతో పొత్తుకు జనసేన దాదాపు సిద్ధమయిందనే చెప్పాలి. ఎన్నికలకు ఏడాది ముందు రెండు పార్టీల మధ్య సయోధ్య కుదిరే అవకాశముంది. అయితే దీనికి సూత్రధారి నాదెండ్ల మనోహర్ అని చెబుతున్నారు. ఆయన పవన్ కల్యాణ్ మైండ్ ను ఛేంజ్ చేశారన్నది జనసేనలోనూ వినిపిస్తున్న అభిప్రాయం. జనసేన పార్టీలో ఇప్పటి వరకూ నాదెండ్ల మనోహర్ కీలకమనే చెప్పాలి. ఆయన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ గా ఉన్నారు. మాదాసు గంగాధరం వంటి నేతలు పార్టీని విడిచి బయటకు వెళ్లడానికి కారణం కూడా నాదెండ్ల మనోహర్ కారణమంటారు. ఒకరకంగా జనసేన పార్టీ నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ పార్టీకి దూరం కావడానికి కూడా నాదెండ్ల మనోహర్ కారణమన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. జనసేన, టీడీపీతో పొత్తు కు వచ్చే ఎన్నికల్లో బీజం పడటానికి కూడా నాదెండ్ల మనోహర్ కీలకంగా మారబోతున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే పార్టీని నడపలేక ఆర్థిక ఇబ్బందులతో పవన్ కల్యాణ్ సినిమాలను ఎంచుకున్నారు. మరో ఐదేళ్లు అధికారానికి దూరంగా ఉంటే మరింత ఇబ్బంది పడతామని నాదెండ్ల పదే పదే పవన్ కల్యాణ్ కు చెప్పడంతో ఆయన టీడీపీతో పొత్తుకు సిద్ధమయ్యారని తెలిసింది. పదేళ్లుగా శాసనసభకు దూరంగా ఉన్న నాదెండ్ల మనోహర్ కు కూడా టీడీపీతో పొత్తు ప్రయోజనకరమే. తెనాలిలో తన సీటుకు ఢోకా ఉండదని కూడా ఆయన భావిస్తున్నారని పార్టీలో గుసగుసలు విన్పిస్తున్నాయి. అందుకే కమ్మ సామాజికవర్గానికి అనుకూలంగా పవన్ కల్యాణ? చేత నాదెండ్ల మనోహర్ మాట్లాడించారంటున్నారు. మొత్తం మీద టీడీపీ నాదెండ్ల మనోహర్ సహకారంతో మరోసారి అధికారంలోకి వచ్చే ప్రయత్నాలు చేస్తుంది.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

PAY BACK TO SOCIETY SNEHA CLUB

SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob
Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

ప్రజాపాలన
సంపాదకీయం
శుక్రవారం 15, అక్టోబరు 2021

## సిని'మా' ఎన్నికలలో సరికొత్త సవాళ్లు

తెలుగు నటీనటుల వేదిక 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్' (మా) ఎన్నికలలో ప్రకాశ్‌రాజ్ ప్యానల్ ఓడిపోయి, మంచు విష్ణు ప్యానెల్ విజయం సాధించింది. గెలిచిన విష్ణును అభినందించడంతో ఆగక ఓడినవారిని జాతి వ్యతిరేక శక్తులుగా, టుక్‌డే టుక్‌డే గ్యాంగ్‌గా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తన ట్వీట్‌లో తిట్టిపోశారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఈ తీర్పు కోసం ఎంతో ఆశగా ఎదురుచూశారని, వారిని ఓడించడం గొప్ప విషయమని ఆనందపడిపోయారు. విజయం సాధించిన విష్ణు, ఆయన తండ్రి-ప్రముఖ నటుడు నిర్మాత మోహన్‌బాబు తమ కుటుంబానికి ప్రధాని నరేంద్ర మోడీతో వున్న ప్రత్యక్ష సంబంధాన్ని గురించి ప్రచార సమయంలోనే చెప్పారు. ప్రకాశ్ రాజ్ వివిధ సందర్భాలలో బిజెపి మత రాజకీయాలను మరీ ముఖ్యంగా మోడీ హయాంలో ఏకపక్ష ధోరణులను, భావప్రకటనా స్వేచ్ఛపై దాడులను ఖండించిన సంగతి తెలిసిందే. బెంగళూరులో జర్నలిస్టు గౌరీ లంకేశ్ హత్యను నిరసించడంలో ఆయన ముందు నిలిచారు. ఈ కారణంగా సంఘ పరివార్ ఆయనపై చాలా సార్లు విమర్శలతో దాడి చేసింది. 2019 లోక్‌సభ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగానూ పోటీ చేశారు. 'మా' అధ్యక్షుడుగా ప్రకాశ్ రాజ్ పోటీ చేస్తారని మిగిలిన వారికన్నా ముందే ప్రకటించారు. ఆయనకు మాజీ అధ్యక్షుడు, చిరంజీవి సోదరుడు నాగబాబు మద్దతు ప్రకటించారు. ఆయన రంగంలోకి వస్తారనగానే లోకల్ నాన్‌లోకల్ వివాదం ప్రధానంగా వినిపించింది. మీడియాలో చాలామంది నాన్‌లోకల్ కు నాయకత్వం ఇవ్వడమేమిటని వాదించారు. చిరంజీవి మరో సోదరుడు, జనసేన అధినేత (ఆ విధంగా బిజెపి స్నేహితుడు) కూడా అయిన పవన్ కళ్యాణ్ నాన్‌లోకల్ నినాదాన్ని తోసిపుచ్చారు. ఆ మాటన్నది మేము కాదని పైకి చెబుతున్నా ప్రకాశ్‌రాజ్ కోట లోపాయికారిగా గట్టిగా నడిచింది. ఈ దశలో మంచు విష్ణు మరో ప్యానల్‌గా పోటీ చేస్తానని ముందుకొచ్చారు. మొదట్లో వేర్పుగా పోటీ ప్రకటించిన పలువురు ప్రకాశ్ రాజ్ ప్యానల్‌లో చేరిపోవడంతో ఈ రెండు శిబిరాల మధ్యనే పోటీ హెూరాహెూరీగా సాగింది.గత మూడు పర్యాయాలుగా మా ఎన్నికలు పోటాపోటీగా అవుతున్న మాట నిజమే అయినా ఈసారి మరీ ఆరోపణలు, ఆవేశాలు శ్రుతి మించాయి. దూషణలు, ఆరోపణలు కూడా చెలరేగాయి. గత ఎన్నికల్లో నరేష్ విజయం సాధించిన తర్వాత 'మా' సరిగా పని చేయలేదనే భావం బలంగా వుండింది. పని చేయించడానికి, పద్ధతులు పాటించడానికి ఒక క్రమశిక్షణా కమిటీని కూడా నియమించారు. ఈ పూర్వరంగంలో నరేష్ మంచు విష్ణు శిబిరంలో ప్రధాన సంధానకర్తగా ప్రచారం సాగించడం వాదవివాదాలు పెంచింది. ఆన్‌లైన్ టికెట్ల సమయంలో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు వేడిని ఇంకా పెంచాయి. టిడిపి ఎంఎల్ఎ, ప్రముఖ నటుడు బాలకృష్ణ విష్ణును బలపర్చగా వైసీపీ అనుకూలురు కూడా అటే వున్నారన్న వాతావరణం కనిపించింది. జగన్‌కు ఆ కుటుంబంతో వున్న బంధుత్వం రీత్యా కూడా పలువురు ఆ అభిప్రాయం వెలిబుచ్చారు. ఆ దశలో ఎ.పి మంత్రి పేర్ని నాని 'మా' ఎన్నికలతో తమకు ఏ సంబంధం లేదని ప్రత్యేకంగా ప్రకటించినా ఈ అభిప్రాయం పెద్దగా తొలగలేదు.మామూలుగా చిత్ర పరిశ్రమలో విభిన్న రాజకీయ పార్టీలను అభిమానించేవారు వున్నా కళామతల్లి బిడ్డలుగా తామంతా ఒకటేనని చెప్పడం జరుగుతుంటుంది. రాష్ట్ర విభజన తర్వాత ప్రాంతీయ, జాతీయ పార్టీల ప్రభావం కూడా మారింది. రాజకీయంగా మోహన్‌బాబు మొదట టిడిపి ఎం.పి గా వుండి తర్వాత చంద్రబాబు నాయుడుతో విభేదించి జగన్ ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్ష వెలిబుచ్చుతూ వచ్చారు. చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టుకుని తర్వాత కాంగ్రెస్‌లో లీనమై ప్రస్తుతం నటనపై కేంద్రీకరిస్తున్నారు. పవన్ కళ్యాణ్ నాగబాబు జనసేనలో వున్నారు. నరేష్ బిజెపిలో చేరగా కృష్ణంరాజు గతంలో వాజ్‌పేయి హయాంలో మంత్రిగా పనిచేశారు. చిత్ర పరిశ్రమలో రాజకీయ, సామాజిక, ఆర్థిక ప్రయోజనాలతో పాటు వ్యక్తిగతంగానూ కొన్ని ప్రముఖ కుటుంబాల పరంగానూ వైరుధ్యాలు వుండనే వుంటాయి. వేర్వేరు శిబిరాలూ నడుస్తుంటాయి. 2007 జనవరి 28న తెలుగు సినిమా వజ్రోత్సవ సంరంభంలో మోహన్‌బాబుకు సెలబ్రిటీ పురస్కారం, చిరంజీవికి లెజెండ్ సత్కారం చేసిన తర్వాత ఈ తేడాలేమిటన్న దానిపై బహిరంగంగానే వైరుధ్యాలు ప్రజ్వరిల్లాయి. అయితే గత కొన్ని సంవత్సరాలుగా చిరంజీవి, మోహన్‌బాబు స్నేహంగా మాట్లాడుతున్నారు. ఏకగ్రీవం కోసం తనకు కనీసం ఫోన్ అయినా వస్తుందనుకుంటే రాలేదు గనక విష్ణు పోటీలో వున్నారని మోహన్‌బాబు ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. అనేక ఆరోపణలు, అందులో పోస్టల్ బ్యాలెట్లు తెప్పించడం వంటి వాటిపై దుమారాలు, పరస్పర విమర్శల నేపథ్యంలో ఎన్నికలు జరిగి విష్ణు ప్యానల్ విజయం సాధించింది. ఆ తర్వాత బండి సంజయ్ వ్యాఖ్యలను ఉటంకిస్తూ నాన్‌లోకల్ వాదనలకు స్పందిస్తూ ప్రకాశ్ రాజ్ 'మా' సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. నాన్‌లోకల్స్ పోటీ చేయడానికి వీలు లేకుండా నిబంధనలు సవరిస్తామని మంచు విష్ణు అన్నట్టు కూడా ఆయన పేర్కొన్నారు. ప్రాంతీయ వాదం సంకుచితత్వంలో కొట్టుమిట్టాడుతున్న 'మా'లో తాను వుండదలచలేదని మాజీ అధ్యక్షుడు చిరంజీవి సోదరుడు నాగబాబు అంతకు ముందే ప్రకటించారు. వీరి రాజీనామాలు ఉపసంహరించుకోవాలని గెలిచిన విష్ణు కోరారు గాని నాన్‌లోకల్ అంశంపై హామీకి సిద్ధం కాలేదు. జనరల్ బాడీలో చర్చించవలసిందేగాని ముందే తాను ఎలా చెప్పగలనని వ్యాఖ్యానించినట్టు వార్తలు వచ్చాయి.ప్రకాశ్ రాజ్ ప్యానల్ నుంచి గెలిచిన 11 మంది కూడా తర్వాత రాజీనామాలు ప్రకటించారు. వేర్వేరు ప్యానళ్ల నుంచి గెలవడం వల్లనే తాను పని చేయలేకపోయానని గతంలో నరేష్ అన్నారని, ఫలితాల తర్వాత విష్ణు కూడా ఆ తరహాలో మాట్లాడారు గనక ఆయనకు స్వేచ్ఛనివ్వడానికే తాము తప్పుకుంటున్నామని ఆయన వాగ్ధానాల అమలుకు పదవీ కాలంలో జరిగే కృషిని చూస్తుంటామన్నారు. నాన్‌లోకల్ సభ్యులకు కూడా పోటీ చేసే హక్కు వుంటుందని మాట ఇస్తే తన రాజీనామా వెనక్కు తీసుకుంటానని ప్రకాశ్‌రాజ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. దీంతోపాటే ఓట్ల లెక్కింపు అవకతవకలూ, పోలింగ్ నాడు తమపై దౌర్జన్యం చేశారనే ఆరోపణలు కూడా చేశారు. ఇదంతా ఓటమి తట్టుకోలేక చేస్తున్నారని ఇవతలివారు కొట్టిపారేశారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కృష్ణమోహన్ కూడా ఓటమి కారణంగానే ఈ ఆరోపణలు చేస్తున్నారని కొట్టిపారేశారు. 'మా' రెండుగా చీలిపోతుందని కూడా కథనాలు వచ్చినా ఆ ఆలోచన లేదని ప్రకాశ్‌రాజ్ వర్గం ప్రకటించడంతో ప్రస్తుతానికి అలాంటిది జరగలేదు. విష్ణు ప్రమాణ స్వీకారం చేయగా నరేష్ సవాళ్లు విసిరారు. రాజకీయంగా చూస్తే ఈ ఫలితాల తర్వాత బిజెపి నాయకులు, వైసీపీ అనుకూల సోషల్ మీడియా చాలా సంతోషం వ్యక్తం చేస్తుండగా టిడిపి, టిఆర్ఎస్ అనుకూలురు పైకి తక్కువగానే స్పందిస్తున్నారు. రెండేళ్లు మూడేళ్లు వుండే పదవుల కోసం ఇంతగా తగాదాలు పడటం వల్ల పలచన అవుతామని ఈ వాతావరణం ఏర్పడటానికి మూలాలు ఏమిటో వెతకాలని... ఫలితాలు వస్తుండగానే చిరంజీవి అన్నారు.

# మన నదులపై కేంద్ర పెత్తనం ఏమిటి?




ఈరోజు నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నీటి కడవలు చేతులలో పట్టుకుని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జిఆర్ఎంబి), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కెఆర్ఎంబి) ముందు నిలబడి 'మాకు కాసిన్ని నీళ్ళివ్వండి' అని అడుక్కునే దృశ్యం మనం చూడబోతున్నాం. ఒకరు 'మా తండ్రిగారి అధికారానికి వారసత్వం మాదే' అని నిలిచి అధికారం చేజిక్కినదాకా ఆరాటపడినవారు కాగా, మరొకరు 'మా ప్రాంతం మీద అధికారం మాదే' అని చెలరేగిన ఉద్యమంలోంచి అధికారం చేజిక్కించుకున్నవారు. ఇద్దరూ వరుసకట్టి నిలిచి తమ అధికారాలను తేలికగా కేంద్రానికి వదిలేసి నీటికోసం బిచ్చపు పాత్రలతో నిలబడబోతున్నారు. కేంద్రం మిథ్య అని విశ్వాసం ప్రకటించుకున్న తెలుగు ప్రజల ముఖ్యమంత్రులు తాము, తమ రాష్ట్రాలు, తమ ప్రజలు మిథ్య అని, కేంద్రమే సత్యమని బాహాటంగా తలలు వంచుకుని నిలిచే దృశ్యం చూడబోతున్నాం. ఏ గోదావరి, కృష్ణా నదులు తెలుగు ప్రజల వికాసానికి, చైతన్యానికి దోహదమైనాయో ఆ నదులను, వాటి మీద తెలుగు ప్రజల చెమ్మతో నిర్మించిన ప్రాజెక్టులను, వాటి నుంచి తవ్విన కాలువలను కేంద్రానికి వదిలి అడుక్కోవటానికి నిలిచిన దృశ్యమది. తెలంగాణకు ప్రభుత్వం ఉండటం మాత్రమే తెలంగాణ జలసాధన మార్గమని గుర్తించటం వల్లే తెలంగాణ ఉద్యమ పతాక వాక్యంలో నీళ్ళు ప్రధాన పదం అయింది. నిధులు ఎక్కడివక్కడ వ్యయం చేయాలన్నా, ఉద్యోగాలు ఎక్కడివారికక్కడ దక్కాలన్నా రాష్ట్రం ఏర్పడటం, అధికారాలుండటం చాలా కీలకమైన విషయాలైపోయాయి. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటం ఈ అగ్నిలో బలపడింది. 1995 సెప్టెంబర్ 20న అప్పటి ముఖ్యమంత్రికి బహిరంగ లేఖరాసి కృష్ణా జలాల్లో మా వాటా మాకు ఇవ్వకపోతే మేం మలిదశ తెలంగాణ పోరాటం చేస్తామని హెచ్చరించవలసి వచ్చింది. జస్టిస్ శ్రీకృష్ణ కమిటీకి 'తెలంగాణ ఏర్పడటం నీటి సమస్య పరిష్కారానికి అవసరం' అని ఆచార్య మాడభూషి శ్రీధర్ ప్రత్యక్షంగా వివరించినట్టుగానే 'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, నదుల నీటి వాటా సాధన మార్గం అవిభాజ్యమైనవని' పాలమూరు అధ్యయన వేదిక ఒక బహిరంగ లేఖ ద్వారా వివరించవలసి వచ్చింది. రాష్ట్రం ఏర్పడి ఏడున్నర ఏండ్లు గడిచిపోయినా, ఒక ఓటు రెండు రాష్ట్రాలని నమ్మబలికిన భాజపా కేంద్రంలో అధికారం చేపట్టినా తెలంగాణ నీటి వాటా తేలలేదు. కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఎన్నెన్నో పనులు చేసింది కానీ తెలంగాణకు నీరివ్వటానికి కనీస పట్టుదల చూపలేకపోయింది. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కనీస న్యాయాన్ని అవగాహనను సాధించటంలో ఘోరంగా విఫలమైపోయాయి. రాష్ట్రం ఏర్పడితే నీళ్ళు వస్తాయనుకుంటే నదులనే తన్నుకుపోయే పరిస్థితులు దాపురించాయి. కృష్ణా, గోదావరి నదులమీద, వాటి ఆధారంగా వికసించిన జీవితం మీద, వాటి నీరందని ప్రజల ఆరాటపోరాటాల మీద, ఆ నదులపై నిర్మించిన ప్రాజెక్టులలో సర్వం కోల్పోయిన ప్రజల మీద కేంద్రానికి చిన్నపాటి కన్సర్న్ ఏనాడూ లేదు. అయితే ఇపుడు ఏకంగా ఆ నదుల మీద అధికారానికి కేంద్రం ముందుకు వచ్చింది. ఇది అవాంఛనీయమైన, బాధ్యతారహితమైన, చట్టవ్యతిరేకమైన రాకడ. అధికార దాహంతో రాకడ. తెలంగాణ రాష్ట్ర పోరాటానికి సమాధానంగా భారత పార్లమెంటు ఆంధ్రప్రదేశ పునర్విభజన చట్టం చేసింది. ఆ చట్టంతో 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఆ చట్టం 9వ భాగంలో 84 నుంచి 91 దాకా ఎనిమిది సెక్షన్లు ఉభయ తెలుగు రాష్ట్రల మధ్య నీటి పంపిణీ, నిర్వహణ ల సవివర ప్రస్తావన ఉంది. 2021 జూలై 15న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయటానికి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య చెలరేగిన ఘర్షణ ప్రధాన కారణంగా మాట్లాడుతున్నారు కానీ, రాజ్యాంగ పరంగా, చట్టపరంగా కేంద్రానికి అంతటి అధికారాలు లేవు. అంతర్రాష్ట్ర నదుల విషయంలో రాష్ట్రాల మధ్య వివాదం తీవ్రమైనపుడు ఆయా రాష్ట్రాల కోరిక మేరకు ట్రిబ్యునల్స్ ఏర్పరచటం మాత్రమే కేంద్రం చేయగలదు. రాష్ట్ర భూభాగాలమీద, వనరుల మీద సార్వభౌమాధికారం రాష్ట్రాలదే కానీ కేంద్రానిది కాదు. రాజ్యాంగం ఈ దేశాన్ని రాష్ట్రాల యూనియన్‌గా మాత్రమే స్పష్టం చేసింది. అలాగే రాష్ట్ర పునర్విభజన చట్టం కూడా నదులను, ప్రాజెక్టులను కేంద్రం కైవసం చేసుకోవాలని చెప్పలేదు. పైగా ఇద్దరేసి అధికారులను విధాన నిర్ణయబృందంలో ఆయా రాష్ట్రాల నుంచి తీసుకోవాలని చెప్పింది. చట్టం చెప్పిన సానుకూలమైన పనులు చేయకుండా, చట్టంలో ఆటంకంగా ఉన్న అంశాలు సవరించకుండా కేంద్రం పెత్తనానికి ముందుకు వచ్చింది. రెండు తెలుగు రాష్ట్రాల అధికారులకు, ముఖ్యమంత్రులకు ఈ పెత్తనాన్ని ప్రశ్నించే తెలివిలేదనుకోలేము. ఇతరేతర కారణాలు వీరందరినీ స్వీయగౌరవానికి దూరం చేస్తున్నాయేమో?!తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో తెలంగాణ రాజకీయ ప్రతినిధులు కానీ, తెలంగాణ ఉద్యమ సంస్థలుకానీ, తెలంగాణ మేధావులుకానీ తెలంగాణ ఏర్పడితే అంతా అయిపోతుంది అనే వైఖరితో పనిచేశారు. అటు ఆంధ్ర వైపు రాష్ట్ర విభజనను అడుగడుగునా అడ్డగిస్తూ, మరోనోట తెలంగాణ ఏర్పాటును సమర్థిస్తూ నీళ్ల విషయంలో చట్టంలో అనేక మెలికలు చొప్పించే పనిచేశారు. సెక్షన్ 89కి ఒక వివరణను కూడా చేర్పించి పాత ఒప్పందాలకు కట్టుబడాలని అందులో రాయించారు. ఆ మేరకు వారు సక్సెస్ కాగలిగారు. తెలంగాణ సమాజం రాష్ట్ర ఏర్పాటు తరువాత తన తావు వెతుక్కునే వెంపర్లాటలో పడింది. ఎవని బాధ వానికి వదిలేసింది. ఇది ఎంతదూరం పోయిందంటే తెలుగు ప్రజల జీవనప్రదాతలైన రెండు ప్రధాన నదులమీద అధికారాన్ని కేంద్రం స్థిరపరుచుకునే దాకా పోయింది. ఈ కేంద్ర ఉత్తర్వు అమలు మొదలైతే జలవనరుల మీద తెలుగు రాష్ట్రాల అధికారం మిథ్యగా మారిపోతుంది. అంతేకాక ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకలను వదిలేసి రెండు తెలుగు రాష్ట్రాలనే ఇలా అవమాన పరచటంలోని అర్థం ఏమిటో అడిగే పరిస్థితిలో తెలుగు ప్రజలు లేరనుకున్నారా? నదుల నిర్వహణలో తలెత్తే వైరుధ్యాల పరిష్కారానికి బోర్డులను ఏర్పరచటం అనేది మొదటి నుంచి ఉంది. కృష్ణా నదీజలాల పునఃపంపిణీ ఉద్యమం కూడా నీటిని రాష్ట్రాల మధ్య న్యాయంగా పంచి నీటి నిర్వహణ కోసం బోర్డులు ఏర్పరచాలని సూచించింది. తుంగభద్ర, కావేరి బోర్డులు పనిచేస్తున్నాయి. కావేరి బోర్డును ఇటీవల కేంద్ర ప్రభుత్వమే ఏర్పరచింది. ఆ బోర్డులో నాలుగు రాష్ట్రాలకి నిర్వహణ భాగస్వామ్యం ఉంది. తుంగభద్రకు మొదటి నుంచీ రెండు రాష్ట్రాలకు భాగస్వామ్యం ఉండగా ఇపుడు తెలంగాణ దానిలో చేరింది. ఈ బోర్డులకు లేని విధి నిషేధాలను కేంద్రం గోదావరి, కృష్ణా బోర్డులలో చేర్చింది. నిజానికి గోదావరిలో నీటి లభ్యత సమస్యకాదు. ఏ ఘర్షణ లేకున్నా గోదావరిని కూడా వివాదంలోకి తెచ్చి చేతిలోకి తీసుకుంటున్నారు. ఈ విషయంలో కూడా తెలుగు ముఖ్యమంత్రులు విజ్ఞత చూపటం లేదు. పైగా ఒక రాష్ట్రం మీదికి మరొక రాష్ట్రం వాళ్ళు కేంద్రాన్ని ఉసిగొల్పుతున్నారు. ఇంకోవైపు అధికారం పైనుంచి సంక్రమించిందనే తప్పుడు చైతన్యంతో ఈ ముఖ్యమంత్రులు అధికారం ప్రజల నుంచి సంక్రమిస్తుందని కానీ, తెలుగు ప్రజల, తెలంగాణ ప్రజల గౌరవానికి భంగకరంగా నడుచుకుంటున్నామని కానీ ఆలోచించకపోవటం వల్ల మా నదుల మీద మేం నిర్మించుకున్న ప్రాజెక్టుల మీద మీ పెత్తనం చెల్లదు అని ప్రకటించలేకపోతున్నారు. సూటిగా ప్రశ్నించలేకపోతున్నారు. కేంద్ర గెజెట్ నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలని పోరాడలేకపోతున్నారు. దక్షిణ తెలంగాణ ఎగువ ప్రాంతాన్ని అంటే వందశాతం కృష్ణా పరీవాహక ప్రాంతంలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల నల్లగొండ ఎగువ ప్రాంతాల నీటి ఎద్దడిని, అందువల్ల తలెత్తిన సామాజిక, రాజకీయార్థిక వెనుకబాటుతనాన్ని పరిశీలిస్తే ఈ గెజిట్‌తో తలెత్తే ప్రమాదం తెలుస్తుంది. దేశం అమృతోత్సవాలు జరుపుకుంటుండగా మహబూబ్‌నగర్ ప్రజలకు వలసలే ఉత్సవమైనాయి. కృష్ణానదికి నీళ్ళిచ్చే మాకు నీరెందుకు లేదు అని అడగటానికి ఇన్నాళ్ళు ఇక్కడ ప్రభుత్వం లేదు. ప్రభుత్వం వచ్చి ఏడేండ్లు దాటినా ఈ బీడు భూములకి నీటివాటా రాలేదు. ఇప్పటిదాకా నేతలు ఉమ్మడిరాష్ట్రం మనకోసం పనిచేయదు అనేవారు. ఇపుడేమంటారు? కేంద్రం మనవైపు చూడదు అంటారు. నీరు పంచమని అడిగితే ఏకంగా ఆక్రమించటం ఏవిధమైన పంపిణీన్యాయమో, ప్రపంచంలో ఎక్కడా లేని ఈ అనుభవాన్ని కేంద్రం ఎందుకు తెలుగు ప్రజలమీద భారంగా మోపిందో ఆలోచించాలి. ఎగువ రాష్ట్రాలు దాటి రెండు గొప్పనదులు తెలుగు రాష్ట్రాలలోకి వస్తాయి. ఆ నదులతో మన జీవితాలు అనుబంధాలు పెనవేసుకుని ఉన్నాయి. అవి తెలుగు ప్రజల వికాసానికి సోపానాలు. న్యాయంగా పంచుకోవటంలో ఆ నదుల అనుభవంతో పొందిన విజ్ఞతను ప్రదర్శిస్తే కేంద్రాన్ని నిలువరించటం మన నదుల్ని మనకోసం కాపాడుకోవటం, మనమే అధికారం నిర్వహించుకోవటం సమస్యేకాదు.సూటిగా చెప్పేదేమంటే రెండు తెలుగు రాష్ట్రాలలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఈ గెజెట్ ప్రమాదకరం. కేంద్రం విజ్ఞతతో దీన్ని ఉపసంహరించుకోవాలని లేకపోతే ఇదిక్కడ అమలు జరుగబోదని రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పగలగాలి. గత మూడు నెలలుగా పాలమూరు అధ్యయన వేదిక ఈ విషయాన్ని వెబినార్లతో, రెండు టేబుల్ సమావేశాలు, ప్రాతినిధ్యాలతో విస్తృతంగా చర్చిస్తోంది. రాష్ట్రం ఏర్పరచుకున్న ప్రయోజనాన్ని దెబ్బతీసే ప్రమాదాలపై ప్రజల్ని హెచ్చరిస్తోంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను నేడు దహనం చేయాలని ప్రతిపక్ష పార్టీలు ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. అయినా ప్రభుత్వంలో స్పందన లేదు. ఇక ప్రజలే పూనుకోవాలి. స్వీయగౌరవం కాపాడుకోవాలి.

# మోడీ - మానవ హక్కులు

జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సి) 28వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన ప్రసంగం నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అనే విధంగా ఉంది. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరి లో తన సహచర మంత్రి సుపుత్రుడు రైతులపై వాహనాన్ని నడిపి నలుగురి ప్రాణాలను బలిగొన్న అత్యంత దారుణ సంఘటనపై ఇంతవరకు పెదవి విప్పని ఆయన మానవ హక్కులపై మాట్లాడటమే హాస్యాస్పదం. పోనీ ఆ సందర్భంగానైనా అమానుషాన్ని ప్రస్తావించి విచారం వ్యక్తం చేశారా అంటే అదీ లేదు. ఆ పని చేయకపోగా మానవహక్కులపై కొందరు ఇష్టారీతిన అర్థాలు తీస్తున్నారని, ఏ చిన్న సంఘటన జరిగినా మానవ హక్కుల ఉల్లంఘన అంటూ గగ్గోలు పెడతారని, వీటి వల్ల దేశ ప్రతిష్ట దెబ్బతినడంతో పాటు, ప్రజాస్వామ్యానికి హాని కలుగుతోందని చెప్పారు. ఇంతకూ ఆ చిన్న సంఘటన ఏమిటో... ఆ కొందరు ఎవరో ప్రధాని చెప్పనే లేదు. లఖింపూర్ ఘటనపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమై, అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకునేంత వరకు ఏలినవారి ప్రభుత్వంలో నామమాత్రపు స్పందన కూడా కనిపించని వైనాన్ని దేశ ప్రజలందరూ చూశారు. ఆ నిష్క్రియాపరత్వంపై మాట కూడా మాట్లాడని ఆయన మానవహక్కులను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని ఆరోపించడం ఎంత విచిత్రం!నరేంద్రమోడీ చుట్టూ మానవహక్కుల చర్చ జరగడం కొత్తేమీ కాదు. ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుండి సాగుతున్నదదే! కాకపోతే ఎప్పటికప్పుడు తిమ్మినిబమ్మి చేసే టక్కుటమారాలతో ప్రజలను చీల్చి ఏమార్చడం సంఘ్‌పరివారానికి వెన్నతో పెట్టిన విద్య! ఆ కుదురు నుండే వచ్చిన మోడీ ప్రధాని హెూదాలో సైతం ఆ విద్యను ప్రదర్శిస్తున్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ల పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ రైతాంగం చేస్తున్న ఉద్యమం, దానికి దేశ వ్యాప్తంగా లభిస్తున్న మద్దతును, రైతులపై బిజెపి శ్రేణులు చేస్తున్న దాడులను తక్కువ చేసి చూపిస్తున్నట్లుగానే అనేక విషయాల్లో ఇదే ధోరణి! జమ్మూ కాశ్మీర్‌ను ఏకపక్షంగా మూడు ముక్కలు చేసిన తరువాత అక్కడి ప్రజల గొంతులను ఎలా నొక్కేశారు? అక్కడేం జరుగుతోందో బయట ప్రపంచానికి తెలియకుండా ఉండటానికి ఇంటర్‌నెట్‌ను కూడా నెలల తరబడి నిలిపివేశారు కదా! చివరకు ప్రజాప్రతినిధులను, మాజీ ముఖ్యమంత్రులను గృహ నిర్బంధం చేసిన తీరు మానవహక్కులపై దాడి కాక మరేమిటి? ఆ చర్యతో ఏదో సాధించామని చెప్పుకున్న దానికి భిన్నంగా కాశ్మీర్ ఇంకా రగులుతూనే ఉండటానికి, సైనికులతో పాటు అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తుండటానికి కారణం ఏమిటి? ఎందరో మేధావులు, రచయితలు, న్యాయవాదులను జైలు పాలు చేసినప్పటికీ భీమా కోరెగావ్ కేసు అడుగు కూడా ముందుకు ఎందుకు సాగడం లేదు? వయోవృద్ధుడని కూడా చూడకుండా స్టాన్ స్వామిని నానా అగచాట్ల పాల్జేసి, కస్టడీలోనే ప్రాణాలు పోయేలా చేశారే. దీనిని ఏమందాం? మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశ వ్యాప్తంగా మైనార్టీలను, దళితులను, మహిళలను లక్ష్యంగా చేసుకుని సాగిన మూకదాడుల సంగతేంటి? ఇంట్లోకి వచ్చి ఏం వండుతున్నారో తనిఖీలు చేసిన గుంపులకు ఆ ధైర్యం ఎక్కడి నుండి వచ్చింది? సిఎఎ, ఎన్ఆర్‌సిలను వ్యతిరేకించినందుకు ఎందరు దాడులకు గురయ్యారు? ఇలా చెప్పుకుంటూ పోతే ఈ జాబితాకు అంతుందా! నిజానికి ఈ తరహా చర్యల కారణంగానే దేశ ప్రతిష్ట అంతర్జాతీయంగా పాతాళానికి చేరుతోంది. 2020వ సంవత్సరానికి సంబంధించి స్వీడన్‌కు చెందిన ఒక సంస్థ రూపొందించిన ప్రజాస్వామిక నివేదికలో మోడీ హయాంలో మీడియా, పౌరసమాజం, ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అణచివేతకు గురవుతున్నాయని పేర్కొంది. ఐక్యరాజ్యసమితి మానవహక్కుల విభాగం కూడా దేశంలో రోజురోజుకి దిగజారుతున్న మానవహక్కుల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. చివరకు అమెరికా ప్రభుత్వ నిధులతో నడిచే 'ఫ్రీడమ్ హౌస్' సంస్థ కూడా మానవహక్కుల అమలులో మనం అధోగతి వైపు ప్రయాణం చేస్తున్నామని పేర్కొంది. తాజాగా కార్పొరేట్ వ్యవసాయానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న రైతులపై మోడీ ప్రభుత్వ అండతో జరుగుతున్న దాడులపై ప్రపంచవ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రధాని మానవహక్కులకు మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నం చేశారు.

# కాంక్రీట్ జంగిల్ లో మసిబారిన ఆదిమ తెగ యానాదులు !!


## తరాలు మారుతున్నా తలరాతలు మారని యానాదులు !!

మచిలీపట్నం, అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: తరతరాలుగా జనసమూహంలో నిలిచి ఉన్న నమ్మకాలు, సంప్రదాయాలు క్రియా రూపాన్ని దాల్చగా పండుగలేర్పడ్డాయి. రకరకాల పండుగలు ఉన్నప్పటికి, దసరా పండుగకు ప్రత్యేక గుర్తింపు ఉన్నదనడంలో అతిశయోక్తి లేదు. దసరా హిందువుల ముఖ్యమైన పండుగ. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు పదవ రోజు విజయ దశమి కలసి దసరా అంటారు. దసరా పండుగ సందడిలో అమాయక యానాదులు అనాదిగా తమ వేషాల ద్వారా ప్రజలను సంతోషపెట్టి పదో పరకా తీసుకొని పొట్టపోసుకొనే సాధుజీవులు. మచిలీపట్నం లోని ఈడేపల్లి యానాదులు కాలనీ, ముస్తఖాన్ పేట సమీపంలోని యానాదుల కాలనీలలో దసరా సమయంలో పెద్దలు తమ పిల్లలకు తెల్లని సున్నం పోరను వంటిపై పులిమి వాటిపై తిలకం బొట్లు పెడతారు. నీట తడిచిన సున్నం వేడికి చిన్నారుల బాధతో విలవిలాడిపోతారు. ఆ బాధను భరిస్తూనే ఇంటి ఇంటికి తిరుగుతూ ' ఓరోరి బండోడా ... అంటూ స్టీలు కంచెంను లయబద్ధంగా మోగిస్తూ పాటలు పాడుతూ బిక్షాటన చేస్తారు. యానాదులు ఎన్నడూ దురాశకు పోని నిరుపేదలు. కనీసావసరాలకు కూడా నోచుకోని నిజాయతి గల అల్ప సంతోషులు. సంచార గిరిజన తెగకు చెందిన ఈ ప్రజలు. వీరి గురించి కొద్దిగా తెలుసుకొనే ప్రయత్నం చేద్దామా ?

యానాది కులం ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల్డు తెగల జాబితా లో 32 వ కులం. నల్లమల అడవుల నుంచి నెల్లూరు సముద్రతీరం వరకూ విస్తరించిన యానాదులు, సామాజిక పరిణామంలో సేకరణ కొరకు అడవులలో జీవిస్తూ అటవీ ఫలసాయాల ఆధారంగా బ్రతుకు జీవనం చేస్తూ కాలక్రమేణా మారుతున్న జీవనవైవిధానాన్ని దృష్టిలో ఉంచుకుని అడవులకు దగ్గరగా గ్రామాలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తారు. ఎడ్గర్ థరస్టన్ రాసిన 'కాస్ట్స్ అండ్ ట్రైబ్స్ ఆఫ్ సౌత్ ఇండియా(1909)' అనే గ్రంథంలో యానాదులలోని ఉప తెగల గురించి యానాది ప్రజల జీవన విధానం, ఆచార సంప్రదాయాలు మొదలైన అంశాలను చర్చించారు. అందులో పొందుపర్చిన సంగతులు కొన్ని... ప్రాథమికంగా సంచార జాతిగా పిలవబడే యానాదుల ప్రధాన వృత్తి వేట, చిన్న చిన్న జంతువులను, పిట్టలను వేటాడి ఆహారాన్ని సేకరిస్తారు. వీరికి వ్యవసాయం అంటే పెద్దగా ఆసక్తి ఉండదు. ప్రకృతిలో దొరికే ఆకులు, కాయలు, దుంపలతో పాటు ఎలుకలు, పిల్లులు, ఉసిళ్లు, నేలమీద పాకే జంతువులైన ఉడుము, తాబేలు వంటి వాటిని పట్టుకుని ఇష్టంగా తింటారు. చేపలు, పొలంలో ఉండే ఎలుకలు, పంది కొక్కులు, తాబేలు, జంగు పిల్లి మాంసం అంటే వీరికి ఇష్టం. వాటిని నేర్పుతో వేటాడి తెస్తారు. నీటి వసతి ఉండేచోట చేపలు పడతారు. వెదురు బుట్టలు, చాపలు అల్లి వాటిని ఇతరులకు అమ్మి బియ్యం, నూనె, బట్టలు కొనుగోలు చేస్తారు. యానాదులు 'రంగము' అనే దైవచింతనతో వారి పూర్వీకుల లేదా బాధిత పెద్దల ఆత్మలను లేదా వారుకొలిచే కుల దైవాన్ని ఆవాహనా చేసుకుని నిజాన్ని నిక్కచ్చిగా చెప్పగలరు, ఉదాహరణ: ఏదైనా వస్తువు పోయిందనో లేక ఎవరైనా కనిపించకుండా పోయారనో, ఇంటిలో భాదలకో, చీడపీడలకో కులదైవం ఎదుట దీపాన్ని వెలిగించి డప్పుకొడుతూ వాయిద్యం వాయిస్తూ నృత్యం చేస్తూ వారి కులదైవాన్ని గొంతెత్తి ఆలపిస్తారు. వారి దేవత వారి శరీరంలో ప్రవేశించగానే వారికి పూనకం వచ్చేస్తుంది. పోయిన వస్తువు జాడ ఇట్టే చెప్పేస్తారు. జీవనాధారం లేక తాత్కాలిక నివాసాల్ని ఏర్పరచుకుని బ్రతుకు జీవనం సాగిస్తుంటారు. మరికొందరు గ్రామాలలో రైతుల పొలాలలో కూలికి ఎలుకలు పడుతూ జీవిస్తున్నారు. తెలుగు భాషకు మూలపురుషులు యానాదులేనని కత్తి పద్మారావు లాంటివారి వాదన. ప్రముఖ జానపద పరిశోధకులు వెన్నెలకంటి రాఘవయ్య యానాదులపై చేసిన పరిశోధనకు గుర్తింపుగా ఆయనను యానాది రాఘవయ్యగా పిలుస్తారు.

యానాదులు ఉదయాన్నే తినే ఆహారాన్ని (తినే ఆహారాన్ని అనడం కంటే తాగే నీళ్ళు అంటే బావుంటుంది) పులినీళ్ళు అంటారు. పులినీళ్ళ కుండ యానాదోళ్ళకు ఆకలితీర్చే అమ్మ. అన్నం వండేటప్పుడు వంచే గంజి, రాత్రిపూట మిగిలిపోయిన అన్నం ఒక కుండలో పోస్తారు. అవి తెల్లవారేసరికి పులుస్తాయి. కాబట్టి ఆ కుండను పులినీళ్ళ కుండ అని పులినీళ్ళ బువ్వ అని అంటారు.





ఇతర కులస్తులు ఉన్నప్పుడు యానాదులు తమ ఆహారానికి మారుపేర్లు పెట్టి పిలుచుకుంటారు. ఎలుకల కూరని, తంగేడు జింకల కూర అని, ఎండ్రకాయల పులుసని, గెనంకేకల పులుసని, కుందేళ్ళని, సెవల పిల్లుల కూర అని పిలుచుకుంటారు. ఈ మారుపేరుల వెనుక సామాజిక నేపథ్యం వుంది. ఉన్నత కులస్తులలో అత్యధికులు యానాదులను సాటి మనుష్యులుగా సైతం గుర్తించరు సరికదా ఏహ్యభావంతో ఇప్పటికీ చూడటం ఎంతో బాధాకరం. తమనే ఇలా హీనంగా చూస్తున్నారు, ఇక తమ ఆహారాన్ని ఇంకెంత దారుణంగా అనహ్యించుకుంటారో అనే భావనతో తమ ఆహారాన్ని మారుపేర్లతో పిలుచుకుంటారు. సాటి మనిషి తినే ఆహారాన్ని గౌరవించే సంస్కారం నేటి నాగరిక సమాజానికి ఎంతైనా అవసరం. ఇక యానాదుల వివాహ వ్యవస్థ ప్రత్యేకమైనది. పెళ్ళికి ముందురోజు పెళ్ళికొడుకు తరపు పెద్దలు, పెళ్ళికూతురికి ప్రదానం తెస్తారు. కులపెద్దలందరిముందు ప్రదానం విప్పుతారు. ప్రదానానికి తెచ్చే ప్రతి వస్తువు పదకొండు చొప్పున తేవాలి. ఆ వస్తువులలో ఒక వస్తువుకి బదులు మరొక వస్తువు మార్చుకునే అవకాశం పెళ్ళికూతురు తరపు వాళ్ళకి వుంటుంది. యానాదుల పెళ్ళిళ్లలో 'గంజి కావిడ' మరొక విశేషం. పెళ్ళి సందర్భంలో ఒక పెద్దావిడ లేచి "ఇక్కడున్నవాళ్ళు అందరు చూడండి. మేము పేదోళ్లం. మాకు కలిగింది ఈ గంజి బువ్వే. ఈ గంజినీళ్ళే మేం తాగుతాం. నువ్వు కూడా ఈ గంజినీళ్ళను సంతోషంగా పంచుకుంటాను అని అంగీకరిస్తే ఈ గంజినీళ్ళు తాగు" అని తమ స్థితిని ఆచరణ ద్వారా అలివేలుకి, అక్కడున్న పెద్దలందరికి స్పష్టంగా తెలియజేసే ప్రయత్నమే ఈ గంజికావిడి.

నేటి భారతీయ వివాహ వ్యవస్థ విచ్ఛిన్నమైపోవడానికి ప్రధాన కారణం వివాహ సమయం లో నిజాయితీ లేకపోవడం. నిజాయితీతో కూడిన యానాదుల వివాహం నేటి సమాజానికి ఆదర్శప్రాయంగా నిలుస్తుంది.

**ఎన్. జాన్సన్ జాకబ్,**
**సీనియర్**
**జర్నలిస్ట,మచిలీపట్నం.**

## రెండు కుటుంబాలు వివాదం..!

కాకినాడ, అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: తూర్పుగోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతానికి చెందిన ప్రత్తిపాడు నియోజకవర్గంలో రాజకీయాలు హీటెక్కాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య వ్యక్తిగత విమర్శలు , రాజకీయ విమర్శలు రోజుకో రకంగా ముదురుతున్నాయని అంటున్నారు పరిశీలకులు. ఈ నియోజకవర్గంలో కీలకమైన రెండు కుటుంబాలు చక్రం తిప్పుతున్నాయి. అవే వరుపుల, పర్వత ఫ్యామిలీలు. పర్వత ఫ్యామిలీ నుంచి బాపనమ్మ, గుర్రాజు, సుబ్బారావు, చిట్టిబాబు నలుగురు ఎమ్మెల్యేలుగా గతంలో చక్రం తిప్పారు. ఈ కుటుంబం నుంచి ప్రస్తుతం పర్వత పూర్ణ చంద్రప్రసాద్ దూకుడుగా ఉన్నారు. ఆయన ప్రస్తుతం వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు.ఇక, ఇక్కడి నుంచే వరుపుల ఫ్యామిలీ కూడా రాజకీయాలు చేస్తోంది. వరుపుల సుబ్బారావు, జోగిరాజులు టీడీపీలో చక్రం తిప్పుతున్నారు. వరుపుల రాజా టీడీపీలో ఉన్నారు. గత ఏడాది ఎన్నికల్లో పర్వత పూర్ణ చంద్రప్రసాద్ వైసీపీ నుంచి పోటీ చేయగా, టీడీపీ నుంచి వరుపుల రాజా బరిలో దిగారు. అయితే, జగన్ సునామీ నేపథ్యంలో వరుపుల రాజా ఓడిపోయారు. పర్వత పూర్ణ చంద్ర విజయం సాధించారు. అప్పటితో రాజకీయాలు ఆగిపోలేదు. అసలు రాజకీయం అక్కడే మొదలైంది. ఎన్నికల తర్వాత వరుపుల రాజా వైసీపీలోకి వచ్చేందుకు ప్రయత్నించారు. అయితే.. పూర్ణచంద్ర అడ్డుకున్నారు. ఎట్టి పరిస్థితిలోనూ రాజాను చేర్చుకునేందుకు వీల్లేదని పూర్ణ భీష్మించారు. దీంతో చేసేది లేక రాజా టీడీపీలోనే ఉండిపోయారు.ఇక, ఆ తర్వాత ఇరువురి మధ్య మరింతగా రాజకీయం రాజుకుంది. గతంలో డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న వరుపుల రాజా నిధుల దుర్వినియోగం చేసినట్టు పూర్ణ ఆరోపించారు. అది కూడా అసెంబ్లీలోనే ఆరోపించడం, విచారణకు పట్టుబట్టడంతో జగన్ సర్కారు ఈ విషయంలో విచారణకు ఆదేశించింది. రంగంలోకి దిగిన అధికారులు డీసీసీబీలో రూ.16 కోట్ల అక్రమాలు జరిగాయని తేల్చారు. దీంతో పోలీసులు రాజాను అరెస్టు చేసేందుకు రెడీ అయ్యారు. అయితే, ఆయన హైకోర్టుకు వెళ్లి తన అరెస్టుపై స్టే తెచ్చుకున్నారు.ఇక, తనను కేసుల్లో ఇరికించేందుకు పూర్ణ ప్రయత్నించారంటూ.. రాజా వ్యక్తిగత విమర్శలకు దిగారు. దీనికి పూర్ణ మరింత రెచ్చిపోయారు. దీంతో ఈ వివాదం కాస్తా.. రెండు కుటుంబాల వివాదంగా మారిపోయింది. అయితే, ఇద్దరూ కూడా ఒకే సామాజిక వర్గానికి చెందిన నాయకులు కావడంతో టీడీపీ తరఫున రంగంలోకి దిగిన సీనియర్లు.. నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించారు. అయితే, ఎమ్మెల్యే పర్వత పూర్ణ మాత్రం సయోధ్యకు ససేమిరా అన్నారు. పైగా వైసీపీకి ద్రోహం చేశావంటూ జ్యోతులపై విరుచుకుపడ్డారు.దీంతో సయోధ్య ఆదిలోనే తెగిపోయింది. ఈ పరిణామాలతో నియోజకవర్గం నిత్యం రాజకీయ కక్షలతో అట్టుడుకుతోంది. ఏం జరుగుతుందోనన్న టెన్షన్ నెలకొంది. మొత్తానికి గతంలో ఎంతో ఘన కీర్తి ఉన్న ఈ రెండు కుటుంబాలు ఇలా వ్యక్తిగత దాడులకు, రాజకీయ వేధింపులకు దిగడాన్ని ఓ వర్గం ప్రజలు హర్షించడం లేదని అంటున్నారు పరిశీలకులు. చివరికి ఈ వివాదం ఎటు మలుపు తిరుగుతుందో ? చూడాలి. ఏదేమైనా రెండు పార్టీల అధిష్టానాలు జోక్యం చేసుకుంటే తప్ప సమస్య పరిష్కారం కాదని అంటున్నారు ప్రజలు. చూడాలి ఏం చేస్తారో.

## చంద్రబాబు మాటల్లో తప్పేముందో డీజీపీ చెప్పాలి: వర్ల

అమరావతి: అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: డ్రగ్స్ వ్యవహారంపై టీడీపీ నేతలకు డీజీపీ నోటీసులిస్తారా? అని వర్ల రామయ్య ప్రశ్నించారు. డ్రగ్స్ మాఫియాతో రాష్ట్ర ప్రగతి 20ఏళ్లు వెనక్కి వెళ్లిందన్న చంద్రబాబు మాటల్లో తప్పేముందో డీజీపీ చెప్పాలన్నారు. చంద్రబాబు చేసింది పొలిటికల్ వ్యాఖ్య, దానిపై సీఎం, మంత్రులు స్పందించాలన్నారు. హెరాయిన్ కింగ్‌పిన్ విజయవాడలో ఆఫీసు పెట్టుకుంటే డీజీపీ అలాంటిదేమీ లేదంటున్నారని, సాక్ష్యాలివ్వండని ప్రతిపక్షాలకు డీజీపీ నోటీసులివ్వడం హాస్యాస్పదమన్నారు. దర్యాప్తుచేసి సాక్ష్యాలు సేకరించడమనేది పోలీసుల బాధ్యత అన్నారు. ఐవరీకోస్ట్‌కు, ఎమ్మెల్యే ద్వారంపూడికి ఉన్న సంబంధాలేమిటో పోలీసులు ఏనాడైనా విచారించారా?, ఐవరీకోస్ట్ లో ఎమ్మెల్యే ద్వారంపూడి గోడౌన్లు కడుతున్నది నిజమేనా? అని ప్రశ్నించారు.

## రెండో విడత మంజూరైన ఆసరా చెక్కును అందజేసిన ఎమ్మెల్యే వసంత...



జి.కొండూరు, ప్రజాపాలన ప్రతినిధి అక్టోబర్లి 14: రాష్ట్ర ప్రభుత్వం డాక్రా మహిళలు ఆర్థిక స్వావలంబన కోసం రెండో విడత ఆసరా కార్యక్రమంలో భాగంగా రూ 8.44ప్ కోట్లు నిధులను విడుదల చేసినట్లు, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు.స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన రెండో విడత ఆసరా కార్యక్రమం సభ పెద్దఎత్తున జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీని తూచా తప్పకుండా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి దక్కిందన్నారు.జి.కొండూరు మండలంలోని 1169 ఎస్.హెచ్.జి.సంఘాలకు రూ.రూ.8.44 కోట్లు నిధులు రెండవ విడత ఆసరా కింద ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన దాదాపు 350 హామీలను నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రతి మహిళ రుణపడి ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తుందన్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రతిరోజు చెప్పే కల్లబొల్లి మాటలు మైలవరం ప్రజలు నమ్మొద్దన్నారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి రెండున్నర సంవత్సరాలు అయిందని అభివృద్ధి విషయంలో మైలవరం అభివృద్ధి పథంలో నడిపిస్తున్నన ని ఎమ్మెల్యే వసంత పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నవరత్నాలు పథకాలను ప్రవేశపెట్టిందని ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో లబ్ధి జరుగుతూనే ఉంద అన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ బిడ్డలను విధిగా చదివించుకోవాలి అన్నారు. అనంతరం రెండో వేడుక మంజూరైన రూ 14.44 కోట్ల రూపాయలు చెక్కు ను ఎమ్మెల్యే వసంత లబ్ది దారులకు అంద చేశారు. అంతకుముందు డ్వాక్రా మహిళలు, చిన్నారులు కోలాట బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని విసేసంగా ఆకట్టుకున్నాయి.అంతకముందు ఎమ్మెల్యే వసంత కు పెద్ద ఎత్తున డ్వాక్రా మహిళలు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఎ.ఎం సి చైర్మన్ పామర్తి శ్రీనివాసరావు, ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ, గ్రామ సర్పంచ్ మండల అరుణ, ఎంపీడీవో పి. అనురాధ, వైస్ ఎంపీపీ ఈలప్రోలు తేజస్విని,బ్యాంక్ డైరెక్టర్ వి.రాబాబు, ఏరియా కోఆర్డినేటర్ పిక్లా నాయక్ ఏ పీ ఎం యెహోషువ ,ఎంపీటీసీ సభ్యు కందుల ఏసు రాజు యాదవ్,ఉప సర్పంచ్ వై. శంకర్ రెడ్డి,మందా జక్రధర రావు,పెద్ద ఎత్తున డ్వాక్రా మహిళలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భూమాకు టాస్క్ పెద్దదే



కర్నూలు, అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్లు మాత్రమే సమయం ఉంది. టీడీపీ నేతలు ఇప్పుడిప్పుడే యాక్టివ్ అవుతున్నారు. ప్రధానంగా కొందరికి వచ్చే ఎన్నికలు జీవన్మరణ సమస్య. ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు వచ్చే ఎన్నికలు ఒక ఛాలెంజ్ అనే చెప్పాలి. వచ్చే ఎన్నికల్లోనూ గెలవకపోతే భూమా అఖిలప్రియకు రాజకీయంగా మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. ఇప్పటికే అనేక కేసుల్లో ఆమె ఇరుక్కుని సతమతమవుతున్నారు.నిజానికి భూమా కుటుంబంలో నాగిరెడ్డి, శోభ తర్వాత అంత స్థాయిలో ప్రభావితం చేయగలిగిన నేత ఆ కుటుంబం నుంచి ఎవరూ రాలేదు. భూమా అఖిలప్రియకు ఆ వారసత్వం వహిస్తుందని భావించారు. కానీ బ్యాడ్ లక్ ఆమె నేరుగా ఎన్నికల్లో గెలవలేకపోయారు. తొలిసారి గెలిచింది ఏకగ్రీవంతోనే. ఆ తర్వాత ఎన్నికల్లో ఘోర ఓటమిని చవిచూశారు. తన తండ్రి ప్రాతినిధ్యం వహించిన నంద్యాలతో సయితం ఉప ఎన్నికల్లోనే ఆ కుటుంబం విజయం సాధించిందిఇప్పుడు భూమా అఖిలప్రియ ముందు పెద్ద టాస్కే ఉంది. తొలుత కుటుంబాన్ని చక్కదిద్దుకోవాల్సి ఉంటుంది. భూమా అఖిలప్రియ మంత్రిగా ఉన్నా ఆ కుటుంబంలో విభేదాలు తలెత్తాయి. ముఖ్యంగా ఆమె వివాహం తర్వాత కుటుంబ సభ్యులు ఒక్కొక్కరుగా ఆమె నుంచి విడిపోయారు. దీంతో ఆళ్లగడ్డలో భూమా కుటుంబం పట్టు సడలింది. గంగుల కుటుంబాన్ని ధీటుగా ఎదుర్కొనాలంటే తిరిగి కుటుంబ సభ్యులను తన చెంతకు అఖిల ప్రియ చేర్చుకోవాల్సి ఉంటుంది.భూమా అఖిలప్రియ ప్రస్తుతం ఆళ్లగడ్డలోనే ఉంటున్నారు. పార్టీ కార్యక్రమాలను కూడా తరచూ నిర్వహిస్తున్నారు. తన వద్దకు వచ్చిన కార్యకర్తలతో మనసు విప్పి మాట్లాడుతున్నారు. భర్త ను ప్రస్తుతం ఆళ్లగడ్డ రాజకీయాలకు దూరంగా ఉంచారు. తానే సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారు. అవసరమైన కార్యకర్తలకు ఆర్థికసాయం చేస్తూ అండగా ఉంటున్నారు. మరి ఆళ్లగడ్డ లో భూమా అఖిలప్రియ ఈసారైనా పట్టుసాధిస్తుందా? అనేది చూడాల్సి ఉంది.

## నిధుల గోల్‌మాల్‌లో మరో ట్విస్ట్

విజయవాడ, అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన తెలుగు అకాడమీ నిధుల గోల్‌మాల్‌లో మరో ట్విస్ట్ బయటపడింది. ఏపీలో రెండు ప్రభుత్వ సంస్థల ఎఫ్‌డీలను కూడా గోల్‌మాల్ చేసినట్లు తేలింది. ప్రధాన నిందితుడు సాయికుమార్ ఏపీ గిడ్డంగుల సంస్థ, ఏపీ నూనెగింజల సంస్థల ఎఫ్‌డీలను కొల్లగొట్టాడని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు గుర్తించారు. తెలుగు అకాడమీ స్కామ్‌పై కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన విషయాలను చెప్పారు.ఏపీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌కు చెందిన సుమారు రూ.10కోట్లు, ఏపీ ఆయిల్‌ఫెడ్‌కు చెందిన రూ.5కోట్లు విలువైన ఎఫ్‌డీలను దారి మళ్లించినట్లు ఈ నెల 10న అధికారులు గుర్తించారు. దీంతో బ్యాంకు అధికారులు అంతర్గతంగా విచారణ జరిపారు. వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌కు సంబంధించిన ఎఫ్‌డీలు విజయవాడ భవానీపురంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో ఉన్నాయి. ఐవోబీ నుంచి ఎఫ్‌డీ సొమ్మును ఏపీ మర్కంటైల్ కోఆపరేటీవ్ సొసైటీకి బదిలీ చేసి.. అక్కడి నుంచి సాయికుమార్ ముఠా సొమ్ము డ్రా చేసినట్లు అధికారులు గుర్తించారు.ఆయిల్‌ఫెడ్‌కు చెందిన ఎఫ్‌డీలు వీరపునాయునిపాలెం సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో ఉన్నాయి. అందులోని రూ.5కోట్ల ఎఫ్‌డీనీ కొట్టేసినట్లు గుర్తించారు. కాగా, మర్కంటైల్ సొసైటీ చైర్మన్ సత్యనారాయణరావుకు భారీగా కమీషన్ ఇచ్చి నిధులు విత్ డ్రా చేయడంలో సాయికుమార్ కీలక పాత్ర పోషించినట్లు తెలంగాణ పోలీసులు.. ఏపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో ఏపీ సీఐడీ ద్వారా ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టనున్నట్లు తెలుస్తోంది.ఐవోబీ బ్యాంకు ఉద్యోగుల పాత్రపైనా ఆరా తీస్తున్నారు.ఏపీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, ఏపీ ఆయిల్‌ఫెడ్‌లో ఎఫ్‌డీల సొమ్ము దారి మళ్లినట్లు గుర్తించామని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. దీనిపై విచారణ జరుగుతోందని.. సొమ్ము కొట్టేసిన వారిపై చట్టపరంగా చర్యలుంటాయన్నారు. ఆయా బ్యాంకుల అధికారులు అంతర్గత విచారణ జరుపుతున్నారని.. ఎవరెవరి పాత్ర ఉందో విచారణ జరుపుతామన్నారు.

## ఎన్నికల ముందే ప్రణాళికలు

విజయవాడ, అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: తెలుగుదేశం పార్టీకి ఒకప్పుడు తూర్పు గోదావరి జిల్లాలో మంచి పట్టు ఉండేది. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత ఈ జిల్లాలో నేతలు అనే వారు లేకుండా పోయారు. 19 నియోజకవర్గాలుంటే అందులో ఒకరిద్దరు మాత్రమే యాక్టివ్ గా ఉండటం విశేషం. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా జిల్లాలో నేతలు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం చర్చనీయాంశంగా మారింది. అధికారంలో ఉన్నప్పుడు పదవులు దక్కించుకున్న వారు సయితం మొఖం చాటేశారు.తూర్పు గోదావరి జిల్లాలో టీడీపీకి సీనియర్ నేతలున్నారు. గత ఎన్నికల్లో ఈ జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో మాత్రమే టీడీపీ విజయం సాధించింది. వీరిలో గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మకాయల చినరాజప్పలు యాక్టివ్ గా ఉన్నారు. రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావులు చురుగ్గా లేరు. ఎమ్మెల్సీగా ఉన్న యనమల రామకృష్ణుడు అప్పుడప్పుడు మీడియా సమావేశాలు పెట్టడం తప్ప జిల్లాలో పార్టీని బలోపేతం చేసే ప్రయత్నం చేయడం లేదు.కొద్దో గొప్పో అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కొంత చురుగ్గానే ఉన్నారు. మిగిలిన నేతలందరూ కాడి కిందపడేశారనే చెప్పాలి. ఎవరూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. క్యాడర్ కు కూడా దూరంగా ఉంటున్నారు. నియోజకవర్గాల్లో పర్యటనలు కూడా చేయడం లేదు. ఇటీవల రైతు కోసం ఇచ్చిన కార్యక్రమంలో కూడా కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే నేతలు పాల్గొన్నారు. దీనిపై చంద్రబాబు సీరియస్ అయినట్లు తెలుస్తోంది.జనసేనతో పొత్తు ఉంటుందని సంకేతాలు బయటకు రావడంతో నేతలు కూడా నిరాశలో ఉన్నారని తెలిసింది. ఈ జిల్లాలోనే జనసేన ఎక్కువ స్థానాలను కోరే అవకాశముంది. అందుకే ఇప్పటి నుంచి లేని పోని ఖర్చు ఎందుకన్న నిరాశలో అనేక మంది నేతలు ఉన్నారు. అందుకే ఖర్చు చేసేందుకు, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఎవరూ ఉత్సాహం చూపడం లేదు. పొత్తుకు ముందే ఈ జిల్లాలో టీడీపీపై భారీ ఎఫెక్ట్ పడినట్లే కనపడుతుంది.

# చేతులెత్తేసిన జనపథ్

న్యూఢిల్లీ, అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: కాంగ్రెస్ కు ఈ దురవస్థ ఎప్పుడూ లేదు. ఇన్నాళ్లూ పార్టీ పై పెత్తనం చెలాయించిన టెన్ జన్ పథ్ ఇప్పుడు చేతులెత్తేసినట్లే కన్పిస్తుంది. అధికారంలో సొంతంగా ఉంది మూడు రాష్ట్రాల్లో. ఈ మూడు రాష్ట్రాల్లోనూ అసంతృప్తిని కట్టడి చేయలేకపోతుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రులు అయిన వారిలో కూడా మార్పు వచ్చింది. హైకమాండ్ తమను ఏమీ చేయలేదని ఎక్కడకక్కడ సొంత గ్రూపులను ఏర్పాటు చేసుకుంటున్నారు. 2014 వరకూ సోనియా గాంధీ ఏది చెబితే అదే వేదం. వరసగా రెండు సార్లు అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ నేతలు కూడా సోనియా ఆదేశాలను తుచ తప్పక అమలు చేసేవారు. టెన్ జన్ పథ్ నుంచి ఏం ఆదేశాలు వస్తాయోనన్న ఉత్కంఠ వారిలో కనపడేది. కానీ రెండు సార్లు వరసగా ఓటమి పాలు కావడం, కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకపోవడంతో సోనియా గాంధీని కూడా లెక్క చేయని పరిస్థితి కాంగ్రెస్ నేతల్లో కన్పిస్తుంది. కాంగ్రెస్ కష్టాల్లో ఉన్నప్పుడు నాలుగు రాష్ట్రాలను ప్రజలు ఆ పార్టీకి అందించారు. పంజాబ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్ ఘడ్, రాజస్థాన్ లలో కాంగ్రెస్ పార్టీ ఏకపక్ష విజయం సాధించింది. మధ్యప్రదేశ్ లో కాంగ్రెస్ గొడవల కారణంగా అధికారాన్ని కోల్పోయి తిరిగి బీజేపీకి అప్పజెప్పాల్సి వచ్చింది. జ్యోతిరాదిత్య సింధియాను దూరం చేసుకుని టెన్ జన్ పథ్ అతి పెద్ద తప్పిదం చేసింది. ఆయన వచ్చే ఎన్నికలలో బీజేపీకి కీలకంగా మారనున్నారు. ఇక అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల్లోనూ ముఖ్యమంత్రులు హైకమాండ్ ను అవసరమైతే ఎదిరించే ధోరణిలో ఉన్నారు. పంజాబ్ లో చివరకు ముఖ్యమంత్రిని మార్చి కాంగ్రెస్ చేతులు కాల్చుకుంది. పంజాబ్ లో ఇప్పుడు కాంగ్రెస్ ను బలోపేతం చేయడం అంత సులువు కాదు. ఇక రాజస్థాన్, ఛత్తీస్ ఘడ్ లలోనూ అసంతృప్తి మామూలుగా లేదు. ఎప్పుడైనా అవి బయటపడే అవకాశాలున్నాయి. మొత్తం మీద టెన్ జన్ పథ్ నేతలపై పట్టు కోల్పోయిందనే చెప్పాలి.

## రూ. 50 కి చేరిన టమాటా

కర్నూలు, అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: రైతుల పరిస్థితి ఎప్పుడెలాగుంటుందో వాళ్లకే తెలియడం లేదు. రైతు కష్టాన్ని పక్కనబెడితే కనీసం పెట్టిన పెట్టుబడి కూడా దక్కక అన్నదాతలు అప్పుల పాలవుతున్నారు. కూరగాయలు పండించే రైతుల పరిస్థితి అయితే మరి దారుణంగా మారింది. మొన్నటివరకు టమాటా రైతులది ఇదే పరిస్థితి. టమాటా ధరలు పాతాళానికి పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మొన్నటివరకు టమోటా రైతులు గిట్టుబాటు ధర లేక టమాటాను రోడ్లపై పారబోశారు. మరికొందరు పంటను పశువులకు వదిలేశారు. రైతులు టమాటా పంట తీసివేయటంతో వెంటనే టమాటా ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. మొన్నటివరకు చాలా కిలో రూ. 10 పలికిన టమాటా ఇప్పుడు ఏకంగా రూ 50 పలుకుతోంది. ఒక్కసారిగా పెరిగిన ధరలతో టమాటా రైతులే ఆశ్చర్యపోతున్నారు. తమకు మంచి రోజులు వచ్చాయంటూ సంతోషం వ్యక్తంచేస్తున్నారుఆంధ్రప్రదేశ్?లోని కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌కు పెద్దఎత్తున టమాటా తరలివస్తోంది. టమాటా ఎక్కువగా పండే తుగ్గలి, మద్దిగెర, జొన్నగిరి ప్రాంతాల నుంచి పత్తికొండ మార్కెట్‌కు చేరుతోంది. ఒకవైపు డిమాండ్? మరోవైపు ఎగుమతులు పెరగడంతో టమాటా సప్లై చేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. టమాటాకు మంచి ధర పలుకుతోన్నా ఆ స్థాయిలో పంట దిగుమతి లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో టమాటా పంటలు దెబ్బతిని దిగుబడి పడిపోయింది. ధర ఉన్నప్పుడేమో దిగుబడి ఉండదు. మంచి దిగుబడి ఉంటే ధర ఉండదు. ఇలా, ఎలా చూసినా నష్టపోయేది మాత్రం రైతన్నే అవుతున్నాడు. అయితే టమాటా ధర పెరగడంతో సామాన్యుడిపై భారం పడనుంది. ఇప్పిటికే పెట్రోల్, డీజిల్, వంట నూనె ప్రజల నడ్డివిరుస్తోంది. తాజాగా టమాటా ధర పెరగటంతో కొందరు టమాటా వాడకాన్ని తగ్గిస్తున్నారు. ఉల్లి రేటు కూడా పెరగటంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.


## దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలు

**ఆలయాల అభివృద్ధి ఘనత**
**సీఎం జగన్ దే: ఎమ్మెల్యే మల్లాది విష్ణు**



విజయవాడ అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: సీఎం జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. దేవీ శరన్నవరాత్రులలో భాగంగా గురువారం నియోజకవర్గంలోని బావాజీ పేట, న్యూ ఆర్.ఆర్.పేట, అజిత్ సింగ్ నగర్ సహా పలు ప్రాంతాలలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలలో శాసనసభ్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సెంట్రల్ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని ఈ సందర్భంగా మల్లాది విష్ణు అన్నారు. గడిచిన రెండున్నరేళ్లల్లో దేవాలయాలలో ఉత్తమ నిర్వహణ పద్ధతులు తీసుకువచ్చామన్నారు. ఆలయాలకు వచ్చే భక్తులకు వసతి సదుపాయాల కల్పనలోనూ ఎక్కడా రాజీ పడడం లేదన్నారు. సనాతన హిందూ ధర్మాన్ని, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేస్తూ.. గుడికో గోమాత సహా ఎన్నో ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ధూప, దీప, నైవేద్యాల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రజల్లో భక్తి భావన పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కనుక ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించుకొని సన్మార్గంలో పయనించాలని.. అప్పుడే సమాజం సుఖ:సంతోషాలతో ఉంటుందని వ్యాఖ్యానించారు. అనంతరం పలుచోట్ల దాతలు ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాలలో పాల్గొని భక్తులకు అన్నవితరణ చేశారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని.. దానాలన్నింటిలోను అన్నదానం మహాశ్రేష్టమైనదని అన్నారు. పేదల ఆకలి తీర్చడం, తోటివారికి సహాయం చేయడం దైవ్య కార్యాలతో సమానమన్నారు. కనుక ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో పేదలకు సహాయసహకారాలు అందించి దానగుణాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమాలలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు బాలి గోవింద్, ఇసరపు దేవి రాజా రమేష్, వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు హాఫీజుల్లా తదితరులు పాల్గొన్నారు.

# ఓవర్ టూ ఉత్తరాంధ్ర...!



విశాఖపట్టణం, అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ ఆ నిర్ణయం తీసుకుంటారా? జగన్ ఆలోచన అదే విధంగా ఉందా? ఈసారి జగన్ రెండుచోట్ల నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారా ? అంటే అవుననే అంటున్నాయి పార్టీ వర్గాలు. జగన్ రాజకీయంగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. వచ్చే ఎన్నికలు జగన్ కు ముఖ్యం. రెండోసారి గెలిచి విపక్ష టీడీపీని పూర్తిగా నిర్వీర్యం చేయాలన్న ఆలోచనతో ఉన్నారు. వైఎస్ జగన్ ఇప్పటి వరకూ ఎప్పుడూ రెండు చోట్ల నుంచి పోటీ చేయలేదు. ఆయన ఎప్పుడైనా పులివెందుల నుంచి పోటీ చేస్తారు. అక్కడ పెద్దగా ప్రచారానికి కూడా వెళ్లరు. ఎందుకంటే పులివెందుల వైఎస్ కుటుంబానికి కంచుకోట. అక్కడ ప్రత్యర్ధి పార్టీల అభ్యర్థులు కూడా జగన్ దరిదాపుల్లో ఉండరు. పులివెందులలో ఇప్పటికే వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశారు. విపక్షాలు సయితం జగన్ పులివెందులకు దోచి పెడుతున్నారని విమర్శలు కూడా చేస్తున్నారు. అయితే ఈసారి జగన్ ఉత్తరాంధ్ర నుంచి కూడా పోటీ చేయాలని జగన్ భావిస్తున్నారు. అందుకు కారణాలు కూడా పార్టీ నేతలు చెబుతున్నారు. జగన్ మూడు రాజధానులను ప్రకటించినా న్యాయస్థానాలకు వెళ్లి విపక్షాలు దానిని సమర్థవంతంగా అడ్డుకున్నాయి. అమరావతి రైతులు కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ఆ కేసు ఎప్పటికి తేలుతుందో ఎవరికీ తెలియదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి స్థాయిలో ఉత్తరాంధ్రలో పోటీ చేయాలని భావిస్తున్నారంటున్నారు. పులివెందులతో పాటు ఉత్తరాంధ్రలో కీలక నియోజకవర్గం నుంచి జగన్ పోటీ చేయాలనుకుంటున్నారు. దీనివల్ల ఉత్తరాంధ్రలో వైసీపీ మరింత బలోపేతం అవుతుంది. రాయలసీమలో ఎటూ వైసీపీ అత్యధిక స్థానాలు దక్కించుకుంటుంది. ప్రకాశం, నెల్లూరు జిల్లాలను మినహాయిస్తే గుంటూరు, కృష్ణాలోనే పార్టీ కొంత దెబ్బతినే అవకాశముందన్న లెక్కలు వేస్తున్నారట. ఇటీవల ఉత్తరాంధ్ర కు చెందిన ముఖ్యనేతతో జగన్ ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు చెప్పుకుంటున్నారు. మొత్తం మీద జగన్ ఎన్నడూ లేని విధంగా ఈసారి రెండుచోట్ల నుంచి జగన్ పోట చేస్తారంటున్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సహాయం చేయండి: బెల్లాన చంద్రశేఖర్ యమ్. పి. విజయనగరం





గుంటూరు, అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: విజయనగరం జిల్లా రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ ప్రెసిడెంట్ మజ్జి అప్పారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సకాలం వైద్యం అందించేందుకు తోడ్పాటు ను అందించే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఐదు వేల రూపాయలు నగదు బహుమతి అందించే పథకము కి సంబంధించిన ప్రచారం చేయడం సంబంధించిన పోస్టర్ ను విజయనగరం పార్లమెంటు సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ తమ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు అత్యంత విషాదకరమైన సంఘటనలు దీనినివారణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి ఒక్కజిల్లాలో పార్లమెంట్ సభ్యుడు అధ్యక్షతన జిల్లా కమిటీ లు ఏర్పాటు చేశారు అని ఈ యొక్క కమిటీల్లో రోడ్డు భద్రతా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించే యాక్టీవ్ యన్. జి. ఓ ప్రతినిధులు ముగ్గురు కి సభ్యులు గా అవకాశం ఉంటుంది అని మరి రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ సంస్థ విజయ నగరం జిల్లా అధ్యక్షులు మజ్జి అప్పారావు ఆధ్వర్యంలో ఈరోజు "గుడ్ సమరితన్" పోస్టర్ నా చేతులు మీదుగా ప్రారంభించడము చాలా సంతోషం అని, మజ్జి అప్పారావు గారు తమ యన్ .జి. ఓ ద్వారా ప్రజల్లో అవగాహన కలిపించేందుకు ముందు కు రావడం చాలా గొప్ప విషయం అని పేర్కొన్నారు. అనంతరం మజ్జి అప్పారావు వారి కమిటీ యమ్. పి ని శాలువతో సత్కరించారు ఈ కార్యక్రమములో వలిరెడ్డి రవీంద్ర నాయుడు కర్రోతు విశ్వశర రావు,మీసాల రాము, పైలా ఈశ్వరరావు మోదిలి తరు0కుశం యల్ .తవుడు తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మల్లాది విష్ణు విజయదశమి శుభాకాంక్షలు



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : విజయదశమి పర్వదినం సందర్భంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుభాకాంక్షలు తెలిపారు. చెడు మీద మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని కోరుకున్నారు. జగన్మాత కృపా కటాక్షంతో తెలుగు లోగిళ్లలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్రంలో అనేక పరిపాలనా సంస్కరణలకు సీఎం జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ను దేశంలోనే అమేయశక్తిగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సర్వమత సమానత్వం, సౌభ్రాతృత్వం వర్ధిల్లుతున్నాయన్నారు. ఆ జగన్మాత చల్లని దీవెనలు ఈ ప్రభుత్వంపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. దుర్గమ్మ తల్లి అనుగ్రహంతో నియోజకవర్గంలో ప్రభుత్వ పాలన, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అద్భుతంగా అందుతున్నాయన్నారు. అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని.. ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు వరించేలా దుర్గామాత దీవించాలని వేడుకున్నారు. ఈ విజయదశమి పర్వదినాన్ని ప్రజలంతా భక్తిశ్రద్ధలతో కరోనా నిబంధనలు పాటిస్తూ జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## మహిషాసుర మర్ధిని గా దుర్గమ్మ దర్శనం



కంచికచర్ల అక్టోబర్ 14 ప్రజా పాలన ప్రతినిధి: నెహ్రూ సెంటర్ వద్ద విశ్వశాంతి యువజన మిత్రమండలి ఆ ధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద దసరా శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగు తున్నాయి. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజైన నిజ ఆశ్వయుజ శుద్ధ నవమి నాడు జగ న్మాత కనకదుర్గమ్మ శ్రీ మహిషాసురమర్థినీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అష్ట భుజాలతో దుష్టుడైన మహిషాసురుడిని అమ్మవారు సంహరించింది ఈ రూపంలోనే. అందుకే ఇది నవదుర్గల్లోఅత్యుగ్రరూపం. ఈ రోజున జగన్మాత కనకదుర్గమ్మ లేతరంగు దుస్తుల్లో సింహ వాహనాన్ని అధిష్టించి, ఆయుధాలను ధరించి న మహాశక్తిగా భక్తులను సాక్షాత్కరిస్తుంది. ఎనిమిది రోజుల యుద్ధం తరవాత అమ్మ నవమినాడు మహి షా సురుణ్ని మర్ధించి, లోకాలన్నింటికి ఆనందాన్ని చే కూర్చింది. అమ్మవారి సన్నిధిలో కోన శ్రీనివాస రావు కుటుంబ సభ్యులు అమ్మవారికి కుంకుమార్చనతో పా టు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏ ర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో సుమారు వె య్యిమందికి పైగా అన్నప్రసాదం స్వీకరించారు. దేవీ నవరాత్రులు నిర్వహణలో విశ్వ శాంతి యువజన మి త్రమండలికంచికచర్ల ప్రాంతంలో విశ్వశాంతి యువజ న మిత్ర మండలి వారి ఆధ్వర్యంలో జరిగే దేవీనవరా త్రి ఉత్సవాలు ఎల్లప్పుడూ ప్రత్యేకమే. మిత్ర మండలి బృందం పలువురు దాతల సహాయంతో ప్రతి ఏడాది నవరాత్రి ఉత్సవాలు జరుపుతారు. కరుణ చూపే కన కదుర్గమ్మ దీవెనలు కంచికచర్ల వాసులకు ఎల్లప్పుడు ఉండాలని కోరుకుంటూ నవరాత్రి ఉత్సవాలు ప్రారం భించినది మొదలు అహొరాత్రులు నిద్రాహారాలు మా ని అమ్మవారి సేవలో మిత్రబృందం నిమగ్నమవుతారు. కరోనాతో ఆర్థిక పరిస్థితి కుదేలైన ప్రస్తుత సమ యంలో ఈ సంవత్సరం కూడా నవరాత్రి ఉత్సవాలు జరుగు తొమ్మిది రోజుల పాటు భారీ అన్నదాన కార్య క్రమాలు నిర్వహిస్తున్నారు. నిత్యం అమ్మవారి పూజ ముగిసిన తరువాత సుమారు వెయ్యి మందికి పైగా అమ్మవారి మండపం వద్ద అన్న ప్రసాదం స్వీకరిస్తు న్నారు. మిత్ర మండలి బృందం ఏర్పాటు చేసిన అ మ్మవారి సన్నిధిలో పలువురు ప్రముఖులు అమ్మవా రికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రాజకీయ ప్రముఖు లు, అధికారులు, పెద్దలు నిత్యం అమ్మవారి పందిరి వద్ద అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరిస్తు న్నారు. ఈ సందర్భంగా విశ్వశాంతి యువజన మిత్ర మండలి బృందం మాట్లాడుతూ దాతల సహాయం ఎన్నటికీ మరువలేనిదని అమ్మవారి నవరాత్రి ఉత్స వాలు ఘనంగా జరిగేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్క రికి ధన్యవాదాలు తెలియజేస్తూ అన్నదాన కార్యక్ర మంలో చేయితనందిస్తూ భక్తులకు ఇబ్బందులు కల గకుండా సహాయ సహకారాలు అందిస్తున్న స్థానిక పెద్దలకు, యువకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## వాడవాడలా ... ఆ "ద"సరా ఉత్సవాలు

ఏలూరు, అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: ఒకేసారి రెండు పండగలు మన మహిళలు జరుపుకొంటున్నాం...దెందులూరు శాసనసభ్యులు కొఠారు అబ్బయ్య చౌదరి గారు మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారికత దిశగా మన ప్రభుత్వం అడుగులు వేస్తోందని దెందులూరు శాసనసభ్యులుకొఠారి అబ్బయ్య చౌదరి అన్నారు ఏలూరు మండలం జాలిపూడి మాదేపల్లి గ్రామాల్లో మహిళలకు వైఎస్సార్ ఆసరా రెండో విడత చెక్కులు పంపిణీ కార్యక్రమము పాల్గొన్నారు. గతంలో ఇచ్చిన హామీలను అమలు చెయ్యని ప్రతిపక్షాలు, ఈ రోజు జగనన్న చేస్తున్న పథకాలకు అడుగడుగునా అవరోధాలు సృష్టించడం మీకు తెలిసిందే. కరోనా విపత్కర పరిస్థితుల్లో ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపి హామీ లను వాయిదా వెయ్యవొచ్చు, కానీ మన జగనన్న అలా చెయ్యలేదు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తే , ఆయా కుటుంబాలు ఆర్థిక పురోగతి సాధించగలవనే నమ్మకం తో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి ఒక్క పథకంలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ఆర్థిక తోడ్పాటు తోపాటు రాజకీయంగా, సామాజికంగా ఎదిగేందుకు రాజకీయ, నామినేటెడ్ పదవులు, పోస్టు ల్లో కూడా 50 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారని అన్నారు. మొదటి విడతలో 11 కోట్ల 11 లక్షలు అందించగా, రెండో విడతలో రూ. 11 కోట్ల 16 లక్షల 59 వేలు అందించి ఇచ్చిన హామీలకు కట్టుబడి రుణమాఫీ అమలు చేయడం జరుతోందన్నారు. ఈ మొత్తాలను ఆర్థికాభివృద్ధి కోసం వినియోగించాలని మీ కుటుంబాల కు మహిళ లే కుటుంబ యజమానులు గా, ప్రధాన ఆధారంగా ఉండాలని వారి పేరునే ఇళ్ల పట్టాలు అందిస్తున్న ట్లు తెలిపారు. వైఎస్సార్ ఆసరా రెండో విడత సంబరాలు దసరా పండుగ రోజుల్లో అందచేసే క్రమంలో మీ ఈ వేడుకలు మీ మధ్య జరుపుకుంటున్నా మన్నారు. ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు మీ కుటుంబాల ఆర్థిక అభివృద్ధి కి వినియోగించుకొవాలని కోరారు. తండ్రికి తగ్గ తనయుడిగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక అడుగు వేస్తే తాను రెండడుగులు వేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగు తోందన్నారు. మీకు అడుగడుగునా అండగా, తోడుగా నిలుస్తున్న జగనన్నను 2019 లో ఇచ్చిన ఆశీర్వాదాలు 2024 లో కూడా ఇవ్వాలన్నారు. వైఎస్సార్ ఆసరా రెండో విడత మొత్తాలను మహిళా సభ్యుల లబ్దిదారుల ఖాతాకు చెల్లింపు చేశామన్నారు. తొలుత డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి, ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. తదుపరి వైఎస్సార్ ఆసరా చెక్కును అందచేశారు. డ్వాక్రా మహిళలు జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏలూరు మండలం జాలిపూడి మాదేపల్లి శ్రీ పద్రు కలుకూరు కొల్లేరు నాయకులు ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ఘన స్వాగతం




ఏలూరు అక్టోబరు 14 ప్రజాపాలన ప్రతినిధి: దెందులూరు నియోజకవర్గం శాసనసభ్యులు కొఠారి అబ్బయ్య చౌదరి మరియు జెడ్పిటిసి ఎంపిపి కొల్లేరు నాయకులు లకు రూరల్ అధ్యక్షు లు ఇన్చార్జి మొదలగు నాయకులకు ఘన స్వాగతం పలికిన మాదేపల్లి వై ఎస్ ఆర్ సి పి నాయకులు ప్రజా ప్రతినిధులు ఏలూరు మండలం మాదే పల్లి గ్రామం విచ్చేస్తున్న సందర్భంగా భారీగా ఆహ్వానం పలికి ఏలూరు జడ్పీ హైస్కూల్ నందు వైఎస్సార్ ఆసరా రెండో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మాదేపల్లి నాయకులంతా డోక్రా అక్కా చెల్లెమ్మలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో మహిళలు అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని శాసనసభ్యుల వారికి పూల వర్షం కురిపించారు...
















## రెండవ 'సరైనోడు' కన్ఫ్యూజన్ కంటిన్యూ!

అల్లు అర్జున్ హీరోగా ప్రస్తుతం పుష్ప రూపొందుతున్న విషయం తెల్సిందే. సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న పుష్ప రెండు పార్ట్ లుగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మొదటి పార్ట్ ను డిసెంబర్ లో విడుదల చేయబోతున్నారు. రెండవ పార్ట్ కు ఒక ఏడాది గ్యాప్ వచ్చేలా ప్లాన్ చేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. అందుకు గాను పుష్ప పార్ట్ 1 తర్వాత వేరే సినిమాను బన్నీ చేస్తాడని టాక్ వినిపిస్తుంది. మొన్నటి వరకు ఐకాన్ ను బన్నీ ఆ గ్యాప్ లో చేస్తాడని.. వచ్చే ఏడాది సమ్మర్ తర్వాత నుండి మళ్లీ పుష్ప 2 ను మొదలు పెట్టే అవకాశాలు ఉన్నాయి అంటూ వార్తలు వస్తున్నాయి. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం బన్నీ.. బోయపాటి కాంబో మూవీ కూడా పట్టాలెక్కే అవకాశాలు ఉన్నాయట. వీరిద్దరి కాంబోలో అయిదేళ్ల క్రితం సరైనోడు వచ్చిన విషయం తెల్సిందే. అప్పటి వరకు చూడని భారీ విజయాన్ని బన్నీ ఆ సమయంలో దక్కించుకున్నాడు. అందుకే బోయపాటితో మరోసారి సినిమాను చేయాలని బన్నీ భావిస్తున్నాడట. బోయపాటితో మరోసారి సరైనోడు రేంజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ ను బన్నీ చేస్తాడని చాలా నెలలుగా ప్రచారం జరుగుతోంది. కాని ఇప్పటి వరకు ఆ విషయంలో మాత్రం క్లారిటీ ఇవ్వడం లేదు. పుష్ప సినిమా తర్వాత బన్నీ చేయబోతున్న మూవీ బోయపాటితోనా లేదా వేణు శ్రీరామ్ తో ఐకాన్ సినిమాను చేస్తాడా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బోయపాటితో పాటు కేజీఎఫ్ దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో కూడా బన్నీ సినిమా చేయాల్సి ఉంది. ఇంకా కొరటాల శివ దర్శకత్వంలో కూడా ఒక సినిమా ప్రకటించారు. అది కొన్ని కారణాల వల్ల ప్రస్తుతానికి క్యాన్సిల్ చేశారు.

## సెకండ్ వేవ్ షాక్ తర్వాత వచ్చినవన్నీ డైరెక్టర్ మూవీసే

మొదటి వేవ్ తో పోలిస్తే.. సెకండ్ వేవ్ కారణంగా సినిమా ఇండస్ట్రీకి జరిగిన నష్టం అంతాఇంతా కాదు. ప్రేక్షకుల్లో సైతం విపరీతమైన భయాందోళనలు వ్యక్తం కావటంతో థియేటర్లు ఓపెన్ అయ్యాక.. సినిమా చూసేందుకు ఇప్పుడిప్పుడే వస్తున్నారు. మొదటి వేవ్ తర్వాత ప్రదర్శించిన సాహసం.. తెగువ సెకండ్ వేవ్ తర్వాత మాత్రం కాస్త ఆలస్యమైందనే చెప్పాలి. ఆ మాటకు వస్తే.. మొదటి వేవ్ తర్వాత థియేటర్లు ఓపెన్ చేసుకోవచ్చన్న మాటకు స్పందించిన థియేటర్ యజమానులు.. సెకండ్ వేవ్ తర్వాత మాత్రం అంత ఉత్సాహాన్ని చూపించకపోవటం తెలిసిందే. అదే సమయంలో.. తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ విధానాలు తోడయ్యాయి. ఒకవైపు ప్రేక్షకులు థియేటర్లకు వస్తారో రారో? అన్న సందేహం.. మరోవైపు బడా హీరోలు ఎవరూ కూడా తమ సినిమాలను విడుదల చేయటానికి సాహసించలేదు. ఇలా కర్ణుడి చావుకు ఎన్ని కారణాలు ఉండాలో.. సెకండ్ వేవ్ తర్వాత సినిమా ఇండస్ట్రీ వేగంగా రికవరీ కాకపోవటానికి అన్నేసి కారణాలు ఉన్నాయని చెప్పాలి. సెకండ్ వేవ్ తర్వాత థియేటర్లు ఓపెన్ చేసుకోవచ్చని తెలంగాణ ప్రభుత్వం చెప్పిన నెలన్నరకు కానీ థియేటర్లు ఓపెన్ చేసేందుకు ముందుకు వచ్చారు. దీనికి కారణం.. ఏపీ ప్రభుత్వం థియేటర్ల ఓపెన్ కు సంబంధించిన అనుమతులు ఇవ్వకపోవటమే . ఇంతేకాదు.. సెకండ్ వేవ్ తర్వాత విడుదలైన సినిమాల్ని చూసినప్పుడు అన్ని.. డైరెక్టర్స్ సినిమాలే తప్పించి.. స్టార్ కథనాయకుల సినిమాలు లేకపోవటం కూడా కారణం. తెలుగులో విడుదలైన సినిమాల్ని చూస్తే.. ఏ సినిమా అయినా.. దర్శకుడే ఎక్కువగా ఫోకస్ అయ్యారే తప్పించి.. హీరోలు ఎలివేట్ కాలేదన్నది వాస్తవం. ఎక్కడిదాకానో ఎందుకు విపరీతమైన బజ్ మధ్య విడుదలైన



'లవ్ స్టోరీ' మూవీ విషయానికి వస్తే.. నాగ చైతన్య కంటే కూడా.. ఆ చిత్రానికి దర్శకుడైన శేఖర్ కమ్ముల మూవీగా ప్రచారం జరగటం.. ఓపెనింగ్స్ కూడా ఆ కోణంలోనే జరిగాయని చెప్పక తప్పదు. దసరాకు వస్తున్న అఖిల్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచలర్ మూవీ సైతం దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ బొమ్మ మీద నమ్మకమే సినిమా మీద ఎక్కువగా ఉందని చెప్పాలి. ఇలా.. సెకండ్ వేవ్ తర్వాత రిలీజ్ అయిన అన్ని సినిమాలు దర్శకుడి పేరు మీదనే నడిచాయే తప్పించి.. బడా హీరోల్ని చూసి ప్రేక్షకులు థియేటర్లకు రాలేదన్నది వాస్తవం. మరీ.. ఈ పరిస్థితి మారటానికి మరికొన్నాళ్లు పట్టటం ఖాయమని చెప్పక తప్పదు.

## మళ్లీ ఆ హీరోతో రొమాన్స్ కి రెడీ అయిన కియారా!



షాహిద్ కపూర్-కియారా అద్వాణీ జంటగా సందీప్ రెడ్డి వంగ తెరకెక్కించిన కబీర్ సింగ్ బాలీవుడ్ లో ఎలాంటి విజయం సాధించిందో తెలిసిందే. టాలీవుడ్ బ్లాక్ బస్టర్ అర్జున్ రెడ్డినే మాతృక దర్శకుడు బాలీవుడ్ లోనూ రీమేక్ చేసి అక్కడా సంచలన విజయాన్ని అందుకున్నారు. ఇలా రెండు భాషల్లోనూ సందీప్ ఊహించని అందుకోవడంతో దర్శకుడిగా మంచి పేరొచ్చింది. ఆ సక్సెస్ బాలీవుడ్ లో మరిన్ని అవకాశాలు తెచ్చిపెట్టింది. ఇక షాహిద్-కియారా మధ్య వర్కౌటైన కెమిస్ట్రీ కి స్క్రీన్ పై ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కియారా కెరీర్ ఆరంభంలోనూ బెస్ట్ పెర్ఫార్మర్ గాను ప్రూవ్ చేసుకుంది. ఆ సక్సెస్ బాలీవుడ్ లో పూల బాటని వేసింది. ప్రస్తుతం బాలీవుడ్ లో బిజీ నటీమణుల్లో కియారా ఒకరిగా మారారు. ఈ నేపథ్యంలో మరోసారి షాహిద్ కపూర్ సరసన నటించే ఛాన్స్ ఉందా? మళ్లీ అలాంటి కెమిస్ట్రీ ఇద్దరి మధ్య కుదురుతుందా? అని ప్రశ్నించగా తప్పకుండా అంటూ బధులిచ్చింది. కబీర్ సింగ్ లాంటి స్క్రిప్ట్ ని మిస్ చేసుకోకూడదు. నా కెరీర్ లో ఉత్తమ చిత్రంగా చెప్పుకుంటాను. అలాంటి కథలు చాలా అరుదుగా వస్తాయి. షాహిద్ లాంటి నటుడిగాతో నటించడం బెస్ట్ ఎక్స్ పీరియన్స్ ని ఇచ్చింది. ప్రేక్షకులకు బాగా దగ్గర చేసిన సినిమా ఇది. ప్రేక్షకాభిమానులు ఆశిస్తున్నట్లు మళ్లీ షాహిద్ తో కలిసి నటించే అవకాశం వస్తే అస్సలు వదులుకోను. అలా జరగాలని ఆ దేవుణ్ని నేను కూడా కోరుకుంటాను అని కియారా తెలిపింది. ప్రస్తుతం కియారా అద్వాణీ తెలుగులో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలో నటిస్తోంది. అలాగే ఇటీవలే షేర్ షా చిత్రంతో బాలీవుడ లో మరో సక్సె అందుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం కార్తీక్ ఆర్యన్..టబు..కియారా ప్రధాన పాత్రల్లో అనీస్ బజ్మీ దర్శకత్వంలో బూల్ భులాయా-2 అనే హారర్ కామెడీ చిత్రం తెరకెక్కుతోంది. మరోవైపు రాజ్ మెహతా దర్శకత్వంలో జగ్ జగ్ జియోలో నటిస్తోంది. ఇటీవలే కియారా మిస్టర్ లీలే చిత్రం షూటింగ్ కూడా పూర్తిచేసింది.













Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at : Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com